
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
మంగళవారం 7 జనవరి 2025

జిల్లా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు
కర్నూలు	258	1,32,658	1,41,869	26	2,74,553
పాణ్యం	355	1,61,799	1,70,969	74	3,32,842
పత్తికొండ	257	1,11,922	1,12,430	22	2,24,374
కోడుమూరు(ఎస్సీ)	275	1,23,768	1,23,691	16	2,47,475
ఎమ్మిగనూరు	271	1,22,570	1,26,273	45	2,48,888
మంత్రాలయం	237	1,02,763	1,06,754	25	2,09,542
ఆదోని	256	1,30,961	1,33,669	52	2,64,682
ఆలూరు	294	1,30,633	1,29,528	52	2,60,213
మొత్తం	2203	1017074	1045183	312	20,62,569



జిల్లా ఓటర్లు 20,62,569

తుది ఓటరు జాబితా ప్రచురణ

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఓటర్ల తుది జాబితా-2025 విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల వారీగా వివరాలు వెల్లడయ్యాయి. నూతన జాబితా తయారీలో భాగంగా గతేడాది ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18 వరకు బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించారు. మృతులు, వలస ఓటర్ల తొలగింపుతో పాటు ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువకులకు కొత్తగా ఓటు హక్కు కల్పించేందుకు ఫారం-6 ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. రెండు నెలల పాటు కొనసాగిన సర్వేతో పాటు ఆన్‌లైన్‌లో వచ్చిన క్లెయిమ్‌లపైనా విచారణ చేపట్టారు. ఆ వివరాలతో గతేడాది అక్టోబరులో ముసాయిదా జాబితా విడుదల చేశారు. దీనిపై వచ్చిన అభ్యంతరాలతో పాటు కొత్తగా చేర్పులు, తొలగింపునకు వచ్చిన దరఖాస్తులను విచారించిన జిల్లా ఎన్నికల అధికారులు సోమవారం తుది జాబితాను ప్రచురించారు. మొత్తం 20,62,569 మంది ఓటర్లు వెల్లడించారు.



27,927 ఓటర్ల నమోదు

18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల యువ ఓటర్ల నమోదు స్పెషల్‌సమ్మరి రివిజన్‌లో భాగంగా కర్నూలు నియోజకవర్గంలో 3,430, పాణ్యం నియోజకవర్గంలో 4,866, పత్తికొండ నియోజకవర్గంలో 3,514, కోడుమూరు నియోజకవర్గంలో 3,432, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 3,600, మంత్రాలయం నియోజకవర్గంలో 2,831, ఆదోని నియోజకవర్గంలో 3,146, ఆలూరు నియోజకవర్గంలో 3,108 ఓటర్లు నమోదయ్యారు. అదేవిదంగా సర్వీసు ఓటర్లు 1,615, పీడబ్ల్యూటీ ఓటర్లు 23,908, అలాగే 80 సంవత్సరాలు దాటిన ఓటర్లు 27208, ఎన్ఆర్ఐ ఓటర్లు 123 నమోదయ్యారు.



మిరప రైతు కుదేలు

- తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- మార్కెట్లో ధరాఘాతం
- నష్టాలతో రైతులు దిగాలు

కోడుమూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించిన మిరప రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలింది. తెగుళ్లు, చీడపీడలకుతోడు మార్కెట్‌లో ధరల పతనం మిరప రైతులను కుంగదీశాయి. అప్పులకు వెనుకాడక మిరపసాగు చేసి నష్టాలు మూటగట్టుకుంటున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది వర్షాధారంగా, బోరుబావుల కింద కోడుమూరు మండలంలో 379 ఎకరాలు, గూడూరు 413 ఎకరాలు, సీ. బెళగల్‌లో 2,826 ఎకరాల్లో పండు మిరప సాగైనట్లు తెలుస్తోంది. ప్రధానంగా తేజ, బ్యాడిగ రకాలను రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది ఆగస్టు నుంచి మిర్చి సాగు చేపట్టారు. మొక్కలు నాటినప్పటి నుంచి ఎరువులు, మందుల పిచికారీ చేస్తూ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. అయినప్పటికీ వాతావరణ మార్పులతో దోమ, బ్లాక్ త్రిప్స్, ఎర్రనల్లి పంటపై తీవ్రప్రభావం చూపింది. కాయ దశలో తుఫాన్ల ప్రభావంతో కాయపై మచ్చ ఏర్పడింది. దీంతో కాయ నాణ్యత దెబ్బతిని తాలు శాతం పెరిగింది. పంట కోతకు సమానంగా కల్లంలో కాయల గ్రేడింగ్ ఖర్చు అవుతోందని రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాది తేజ రకాల్లో ఎకరా 10-15 క్వింటాళ్లు, బ్యాడిగ రకాల్లో మంచి కాయల దిగుబడి 3-5 క్వింటాళ్లు మించదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి ఖర్చులు అధికం కావడంతో ఎకరా సాగుకు రూ. లక్షన్నరకు పైగా వ్యయం అవుతోంది. మిరప పంట మంచి దిగుబడి, గిట్టుబాటు ధర లభిస్తే లాభాల పంటే. అయితే రెండేళ్ల నుంచి మార్కెట్ ధరలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. గతేడాది పంట దిగుబడి అందే సమయానికి ధరలు అమాంతం పతనం కావడంతో చాలామంది రైతులు పంటను ఏసీ గోడౌన్‌లలో నిల్వ చేసుకున్నారు. మంచి ధర వస్తే విక్రయించాలని రైతులు ఎదురు చూస్తున్నారు.



గ్రేడింగ్‌లో వేరు చేసిన తాలు కాయలు



మిరప దిగుబడిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

రైతుల ఆశలపై నీళ్లు చల్లేలా క్రమేణా ధరలు మరింత దిగజారాయి. రెండేళ్ల క్రితం వరకు తేజ రకాలు రూ. 22-26 వేలు, బ్యాడిగ రూ 40-60 వేలకు పైగా ధర పలికాయి. అయితే ప్రస్తుతం సగం ధర కూడా అందడం లేదని రైతులు గుర్తు చేస్తున్నారు. ఈ ధరలకు పంటను అమ్మితే పెట్టుబడి ఖర్చులు కూడా రావని, ఇక అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన చెందుతున్నారు. మిరపకు గిట్టుబాటు ధరలు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ప్రభుత్వం ఆదుకోవాలి

కాలువ నీళ్ల కింద రెండెకరాల్లో సింజెంట బ్యాడిగ సాగు చేశాను. వాతావరణ మార్పులకు అనుగుణంగా సమయానికి పిచికారీ చేస్తున్నా తెగుళ్ల బారి నుంచి రక్షించుకోలేకపోయా. బ్లాక్ త్రిప్స్, నల్లితో ముడత వచ్చి ఎకరాకు 10 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. మార్కెట్లో ధర రూ. 12 వేలు మించడం లేదు. ప్రభుత్వం మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.

-శ్రీరాములు, పోలకల్



చెట్టుపైనే కుళ్లిన మిరప కాయలు



తెగుళ్లతో పంట దెబ్బతిన్నది

వర్షాధారంగా ఎకరా విస్తీర్ణంలో బ్యాడిగ సాగు చేశా. తుఫాన్ ప్రభావంతో కాయలు కుళ్లిపోయి తాలు పెరగడంతో గ్రేడింగ్ చేయడానికి ఎక్కువ మంది కూలీలు అవసరం అయ్యారు. సుమారు రూ. 1.5 లక్షకు పైగా ఖర్చు చేస్తే నాణ్యమైన కాయ 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ఏం చేయాలో దిక్కుతోచడం లేదు.

-చిన్న తోటయ్య, వర్కూరు



ధరలు దారుణం

ఎకరా రూ. 10 వేలు చొప్పున రెండెకరాలు కౌలు చేశాను. వర్షాధారం కింద తేజ రకం మిరప సాగుచేశాను. ఎకరాకు రూ. లక్షకు పైగా ఖర్చు అయింది. వర్షాలతో కాయ నాణ్యత దెబ్బతిని తాలు పెరిగింది. దిగుబడి 5 క్వింటాళ్లు మించదు. మరో పక్క మార్కెట్లో క్వింటం రూ. 12-14 వేలు పలుకుతోంది. ఈ రేట్లకు అమ్ముకుంటే నష్టాలే. దీంతో భయపడి కోతలకు జంకుతున్నాను. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- కోటేష్ మిన్నల్ల, గోరంట్ల



తాలు కాయలు చూపుతున్న రైతు

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ పి. రంజిత్ బాషా



అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఓర్వకల్లు మండల సర్వేయర్ వద్ద 165 పెండింగ్‌లో ఉన్నాయని, సర్వేయర్ ఏమి చేస్తున్నారని ఓర్వకల్లు తహసీల్దార్‌ను ప్రశ్నించారు. రెవెన్యూ సదస్సులు పూర్తి కావచ్చినా ఒక్క అర్జీ కూడా పరిష్కరించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మద్దికెర మండలంలో 81, ఎమ్మిగనూరులో 130, పత్తికొండలో 80, కౌతాళంలో 98, ఆలూరులో 111, ఆదోనిలో 37, కర్నూలులో 125, గోనెగండ్లలో 59 పెండింగ్‌లో ఉన్నాయని వాటిని రెండు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం దివ్యాంగ అర్జీదారుల కోసం ఏర్పాటు చేసిన వీల్ చైర్స్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కొండయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

2025-26 విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం. ఉమాపతి

కల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు కర్నూలు సర్కిల్ విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ యాజమాన్యంలోని డిస్ట్రిబ్యూషన్, రిటైల్ సరఫరా లైసెన్స్ నెం.15-2000 ఉన్న పంపిణీ సంస్థ ఏపీ ఎస్పీడీసీఎల్ 2025-26 కుగాను సమగ్ర ఆదాయ ఆవశ్యకత, టారిఫ్, క్రాస్ సబ్సిడీ, సర్‌చార్జ్ ప్రతిపాదనలు 30-11-2024న ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సమర్పించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలపై సూచనలు, అభ్యంతరాలు, సలహాలపై ప్రజాభిప్రాయ సేకరణ ఈనెల 7, 8వ తేదిల్లో విజయవాడలోని ఎస్ కన్వెన్షన్‌లో జరుగుతుందన్నారు. అదే విధంగా ఈనెల 10న స్థానిక దిన్నెదేవరపాడులోని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి భవన్ కర్నూలులో ప్రజాభిప్రాయ సేకరణ ఉదయం 10:30 నుంచి ఒంటి గంట వరకు ఉంటుందని, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారని ఎస్ఈ తెలిపారు. కర్నూలు టౌన్ డివిజన్, సర్కిల్ ఆఫీసులకు కర్నూలు విద్యుత్ భవన్‌లోని సమావేశ భవనంలో ఎమ్మిగనూరు, ఆదోని డివిజన్లకు ఆయా ఎగ్జిక్యూటివ్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని అన్నారు. పేర్లు రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థుల ప్రజాభిప్రాయ సేకరణలో నేరుగా లేదా మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభ్యంతరాలు, సూచనలు ఇవ్వవచ్చుని తెలిపారు. రిజిస్టర్ చేసుకోని అభ్యర్థులు ఆ తేదిల్లో ముందుగా విద్యుత్ సర్కిల్ కార్యాలయాలు, లేదా ఏపీఈఆర్‌సీకి సమాచారం అందిస్తే సమయానుకూలంగా ప్రజాభిప్రాయ సేకరణలో అవకాశం కల్పిస్తారని ఎస్ఈ యం. ఉమాపతి సూచించారు.

డీపీఆర్‌సీలో మూడు రోజుల శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 6: కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, ఏపీ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓ, డీఎల్‌పీఓ, ఈఓఆర్‌డీలకు మూడు రోజుల శిక్షణ ఉంటుందని డీపీ ఆర్‌సీ ప్రిన్సిపాల్ జి. నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో 8 నుంచి 10వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు తదితర అంశాలపై శ్రీకాళహస్తిలో శిక్షణ తీసుకున్న టీఓటీలు ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలకు శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు.

ఆదోని సబ్ రిజిస్ట్రార్‌పై వేటు!

- అక్రమ రిజిస్ట్రేషన్లపై డీఆర్వో విచారణ
- సహకరించిన ఉద్యోగులపైనా చర్యలు
- నూతన సబ్ రిజిస్ట్రార్‌గా అరుణ్‌కుమార్ నియామకం

ఆదోని, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలో అక్రమ రిజిస్ట్రేషన్లపై డీఆర్వో చెన్నకేశవరెడ్డి ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఆదోని సబ్ రిజిస్ట్రార్ హాజీమియాపై వేటుపడింది. ఆయనతో పాటు అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ శాఖ సిబ్బందిపై కూడా వేటు వేశారు. అయితే సస్పెండ్ ఉత్తర్వులను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ బహిర్గతపరచలేదు. సబ్ రిజిస్ట్రార్ హాజీమియా స్థానంలో ఆస్పరి సబ్ రిజిస్ట్రార్ అరుణ్ కుమార్‌ను బదిలీ చేశారు. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదోని పట్టణానికి చెందిన ఎగ్గటి ఈశ్వరప్ప సర్వే నెంబర్ 321-ఏ లో 6.51 ఎకరాల భూమి ఉంది. అయితే అదే పేరుపై మరో వ్యక్తి నంద్యాలకు చెందిన భాస్కర్ ఈశ్వరప్ప చనిపోయినట్లు దొంగ సర్టిఫికెట్లను సృష్టించి ఆ పొలాన్ని గోనెగొండ్ల మండలం పెద్ద మరవీడు గ్రామానికి చెందిన చాకలి ఈరన్నకు విక్రయించిట్లు పత్రాలు సృష్టించారు. విషయాన్ని గమనించిన బాధితుడు ఈశ్వరప్ప సబ్ రిజిస్ట్రార్‌తో పాటు ఇతర వ్యక్తులపై ఆదోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన తాతల కాలం నాటి నుంచి వస్తున్న పొలాన్ని వేరొకరు సంబంధం లేని వ్యక్తులకు విక్రయించినట్లు ఫిర్యాదు చేశారు. దీంతో పాటు గతంలో కూడా ఎస్‌కేడీ కాలనీలో ఇలాగే మరో రిజిస్ట్రేషన్‌లో కూడా గోల్‌మాల్ చేశారు. దీనిపై డీఆర్వో చెన్నకేశవరెడ్డి ఆదివారం ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కళ్యాణి సబ్ రిజిస్ట్రార్ హాజీమియాతోపాటు సిబ్బందిని సస్పెండ్ చేశారు. అదేవిధంగా డాక్యుమెంట్ రైటర్‌పై చర్యలు తీసుకున్నారు. మరింత లోతుగా విచారించి ఎంతమంది ఉన్నా అందరిపై కూడా చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమయ్యారు.



హాజీమియా

ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల, కర్నూలు జిల్లాల పరిధిలో 9 మంది సీఐలు బదిలీ అయ్యారు.

సీఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కంబగిరి రాముడు	ఆళ్లగడ్డ రూరల్	నంద్యాల త్రీటౌన్
ఎస్.సూర్య మౌలి	నంద్యాల త్రీటౌన్	ఎస్‌బీ-2, నంద్యాల
ఎస్.అస్రార్ బాషా	ఎస్‌బీ-2, నంద్యాల	సీసీఎస్-2 కర్నూలు
డి.మురళీధర్ రెడ్డి	సీసీఎస్-2, కర్నూలు	ఆళ్లగడ్డ రూరల్
ఎస్.తేజోమూర్తి	వీఆర్, కర్నూలు	ఎస్‌బీ-1, కర్నూలు
జి.ప్రసాద్	ఎస్‌బీ-1, కర్నూలు	వీఆర్, కర్నూలు
డి.భాస్కర్ రెడ్డి	డీసీఆర్‌బీ, కడప	డీఎస్‌బీ-2, కడ
యు.వెంకట కుమార్	వీఆర్, కడప	డీసీఆర్‌బీ, కడప
వి.వేణుగోపాల్	వీఆర్, కడప	ఎస్సీ, ఎస్టీ సెల్, కడప

జింక్ లోపాన్ని సవరించాలి

- అప్పుడే అధిక దిగుబడి
- వరి, వేరుశనగ, శనగ, మిరప పంటల్లో జింక్ లోపం



గోనెగండ్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రబీ పంటలకు జింక్ లోపం ఎక్కువగా ఉంటుంది. దీన్ని గుర్తించి లోపాలను సరిచేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చు. లేదంటే దిగుబడి తగ్గిపోతుంది. గింజ సన్నగా ఉంటుంది. ధర కూడా పలకదు. కాబట్టి రబీలో రైతులు జింక్ లోపం గుర్తించి చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యం. ఉమ్మడి జిల్లాలో రబీ సాగు కింద 1,17288 హెక్టార్లు సాగు కావాల్సి ఉండగా ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గింది. కేవలం 76,027 హెక్టార్లు మాత్రమే సాగు అయింది. వరి, వేరుశనగ, శనగ, మిపర పంటలలో జింక్ లోపం ఎక్కువ గా కనిపిస్తుంది. దీంతో ఆకులు రంగు మారిపోవడం, పెరుగుదల తగ్గిపోవడం జరుగుతుంది. ఇక ఎక్కువగా వరిలో ఈ జింక్ ప్రభావం ఎక్కువ కనిపిస్తుంది.

పంటలపై జింక్ ప్రభావం


- వరి, వేరుశనగ, శనగ, మిరపతో పాటు ఇతర పంటలో కూడా జింక్ ఆవశ్యకత ఎక్కువగానే ఉంటుంది. పైర్లు పచ్చగా ఎదిగి బాగా దుబ్బు చేయడానికి జింక్ పోషకం ఎంతో తోడ్పడుతుంది.
- మొక్కలో మాంసకృత్తులు, అమినో ఆమ్లాలు తయారీకి నత్రజని, భాస్వరం, పోషకాల సమర్థ వినియోగానికి జింక్ తోడ్పడుతుంది.
- మొక్క పెరుగుదలకు కావాల్సిన ఇండోల్ అసిటిక్ ఆమ్లం ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.
- పత్రహరితంలో జింక్ ముఖ్య ధాతువుగా కిరణజన్య సంయోగ క్రియకు, తద్వార ఆహార ఉత్పత్తికి ఉపయోగపడుతుంది.

జింక్ లోపానికి ప్రధాన కారణాలు

- సేంద్రియ ఎరువులు తగిన మోతాదులో వాడకపోవడం
- సరిగా మగ్గని పశువుల ఎరువులు వేసిన నేలలో కూడా జింక్ లోపం వస్తుంది
- భూమిలో క్షారగుణాలు, సున్నపు పాళ్లు ఎక్కువగా ఉండటం
- ఏడాది పొడువునా నీరు నిల్వ ఉంటూ మురుగుపోకుండా ఉండటం
- ఉదజని సూచిక 8 కంటే ఎక్కువగా ఉండటం
- కొత్తగా అచ్చుకట్టిన పొలాల్లో ఈ లోపం కనిపిస్తుంది
- భాస్వరం ఎక్కువగా ఉన్న నేలలు
- చలి వాతావరణంగల రబీ కాలంలో జింక్ లోపం ఎక్కువగా ఉంటుంది.



జింక్ లోపం వల్ల మచ్చలు వచ్చిన వరి ఆకులు



జింక్ లోపం ఉన్న శనగ పంట

జింక్ నివారణకు అధికారుల సలహాలు అవసరం



రబీ సీజన్‌లో చలి ఎక్కువగా ఉంటుంది. పంట పొలాలలో జింక్ లోపం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సమస్యను పరిష్కరిస్తే పంట దిగుబడి కూడా ఎక్కువగా వస్తుంది. వరి, వేరుశనగ, శనగ, మిరప పంటలతో పాటు మిగతా పంటలలో కూడా జింక్ నివారణ కోసం రైతులు స్థానికవ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలి.

-మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు.

వరిలో జింక్ లోప లక్షణాలు


- వరిలో జింక్ లోపం నాటిన 2 నుంచి 6 వారాల మధ్య కనిపిస్తుంది.
- మొక్కలలో పెరుగుదల ఆగిపోయి గిడస బారతాయి.
- వేరు సరిగా వృద్ధి చెందవు
- పిలకలు రావడం తగ్గుతుంది
- మొక్కల మధ్య ఆకుల్లో ఈనెల మధ్య భాగంలో పసుపు రంగులోకి మారుతుంది. మిగిలిన ఆకు అంచులు పచ్చగానే ఉంటాయి.
- ముదురు ఆకుల చివర్లో మచ్చలు కనిపిస్తాయి. ఆకులు పెళుసుగా ఉండి సులభంగా విరిగిపోతాయి.
- మొక్కలు పొట్టిగా గుబురుగా ఉండి, వెన్నులు ఆలస్యంగా వస్తాయి. మిగతా యాజమాన్య పద్ధతులు పాటించినా జింక్ లోపంతో దిగుబడి బాగా తగ్గిపోతుంది.



జింక్ లోపం ఉన్న వరి పంట

జింక్ లోపం నివారణ చర్యలు:

- ఇంకా వరినాట్లు వేయని రైతులు దుక్కిలో జింక్ వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఆఖరి దమ్ముకు ముందు, ఎకరానికి 20కిలోల జింక్ సల్ఫేట్‌ను వేసి కలియదున్నాలి. పంటను నాటే ముందు పొలానికి వేసే భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులతో జింక్‌ను కలిపి వేయరాదు. అలా చేస్తే భూమిలో జింక్ మొక్కలకు అందని స్థితిలోకి మారిపోతుంది.
- మురుగునీరు సరిగాపోని పొలాలల్లో నాట్లు వేసిన 2 వారాల తరువాత పొలంలో నీటిని పూర్తిగా బయటకు తీసి తర్వాత కొత్తగా నీరు పెట్టడం వల్ల మొక్కలకు భూమి నుంచి జింక్ లభ్యత పెరుగుతుంది.
- చౌడు భూములలో మొదటి దఫాపై పాటు యూరియాకు ఆమ్లగుణం ఉంటుంది. దీని వల్ల భూమిలో చౌడు గుణం తగ్గి జింక్ అందుతుంది.
- పైరులో జింక్ లోపం కనిపించిన వెంటనే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్, 5 గ్రాముల యూరియాను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.



జింక్ లోపం ఉన్న వేరుశనగ పంట

స్నాతకోత్సవ బంగారు పథకాలకు సహకరించండి



మాట్లాడుతున్న రిజిస్ట్రార్

కర్నూలు అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవానికి బంగారు పతకాలు ఇచ్చే దాతలను ఆహ్వానిస్తున్నామని రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిగ్రీ, పీజీ విద్యార్థులు కలిపి 866 మందికి డిగ్రీ ప్రదానం చేయబోతున్నామన్నారు. విద్యార్థులకు బహుమతిగా ఇవ్వడానికి దాతలు, పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, ఆసక్తి గల వారి నుండి బంగారు పతకాలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ప్రథమ స్థానంలో వచ్చిన బీఎస్సీ, బీకాం, బీఏ విద్యార్థులకు ఇవి ఇస్తామని తెలిపారు. దాతలు క్లస్టర్ వర్శిటీ అధికారులను సంప్రదించాలని కోరారు.

పేద కళాకారులకు అండగా ఉంటా

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



కళాకారుని కుటుంబ సభ్యులకు రూ.30 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పేద కళాకారులకు ఎప్పుడూ అండగా ఉంటానని, టీజీవీ కళాక్షేత్రం కళాకారుల అభివృద్ధికి కృషి చేస్తుందని ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. సోమవారం సాయంత్రం నగరంలోని మౌర్యఇన్‌లో గల ఆయన కార్యాలయంలో ఇటీవల అనారోగ్యానికి గురై, ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న రంగస్థల నటుడు సామ్యూల్ కుటుంబానికి ఆయన రూ.30 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా ఆసుపత్రిలో సామ్యూల్‌కు అవసరమైన వైద్య సౌకర్యాలు సమకూరుస్తానని హామీ ఇచ్చారు. రాబోయే కాలంలో పేద, వృద్ధ కళాకారులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలుకు చెందిన కళాకారుడు సామ్యూల్ రాష్ట్రంలోనే నారద పాత్రకు పేరున్న నటుడని అన్నారు. ఆయన ప్రమీలార్జున పరిణయం నాటకంలో నారద పాత్రకు అలాగే సైరా నరసింహారెడ్డి నాటకంలోని అనుచరుని పాత్రకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రెండు నంది అవార్డులు అందుకున్నారని గుర్తు చేశారు. నటన, గాత్రంతో ప్రేక్షకులను మైమరపించే సామ్యూల్ అనారోగ్యంపాలు కాడం దురదృష్టకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సామ్యూల్ కుటుంబ సభ్యులతోపాటూ కళాక్షేత్రం సహాయ కార్యదర్శి పి. రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన టీజీ భరత్



కేంద్ర మంత్రిని కలిసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర భా రీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమార స్వామి, ఉక్కు శాఖ కార్యదర్శితో రాష్ట్ర మంత్రి టీజీ భరత్ సమావేశ మయ్యారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో అర్సె లాల్ మిట్టల్‌కు ఐరన్ ఖనిజం సరఫరాపై చర్చించారు. ఒప్పందం సులభతరం చేయడంలో సహకరించినందుకు మంత్రికి కృత జ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయులపై డీఈఓ అసంతృప్తి



పాణ్యంలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ

పాణ్యం, జనవరి6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు సమయానికి రాని ఉపాధ్యాయులపై డీఈఓ జనార్దన్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టడీ అవర్స్‌కు ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులు ప్రసాద్, ధనలక్ష్మిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడం సరికాదన్నారు. స్టడీ అవర్‌కు తక్కువ మంది విద్యార్థులు హాజరు కావడంపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. ఇద్దరు తెలుగు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ప్రార్థనా సమయానికి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మేరీసునీత, ఎంఈఓ కోటయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కోర్టు గోడ దూకి...

- పోలీసుల నుంచి అంతర్రాష్ట్ర దొంగ పరార్
- గాలించినా లభ్యం కాని దొంగ ఆచూకీ..



తాలుకా పోలీసుల అదుపులో దొంగ (ఫైల్)

ఆదోని రూరల్/ ఆదోని ,జనవరి6(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు కోర్టుకు తరలిస్తుండగా ఖాకీల కళ్లు కప్పి .. కోర్టు గోడదూకి దొంగ పరారయ్యాడు. ఈ ఘటన సోమవారం ఆదోనిలో చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మోహినాబాద్ మండలం సూరగాలి గ్రామానికి చెందిన మురళిపై ఏపీతోపాటు పక్క రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో దొంగతనాల కేసులు నమోదయ్యాయి. ఆదోని టూటౌన్‌లో కూడా ఇతనిపై గతంలో దొంగతనం కేసు ఉంది. రెండు రోజుల క్రితం ఆదోని శివార్లలోని ఎమ్మిగనూరు బైపాస్‌లోని ఓ పాల డెయిరీలో దూరి రూ 10వేల నగదును దొంగలించి, సమీపంలోని సత్యప్ప అనే వ్యక్తి ఇంట్లోకి చొరపడ్డాడు. సత్యప్ప దొంగను వెంటాడి పట్టుకొని తాలుకా పోలీసులకు అప్పగించాడు. మురళి చేసిన దొంగతనం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రావడంతో తాలుకా పోలీసులు ఆ దొంగని త్రీటౌన్ పోలీసులకు అప్పగించారు. అయితే సోమవారం దొంగను కోర్టుకు తరలిస్తుండగా కోర్టు ఆవరణలో పోలీసుల కళ్లు కప్పి కోర్టు గోడ దూకి పరార్యయాడు. పోలీసులు రైల్వే స్టేషన్, బస్టాండ్‌లలో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. కానీ రాత్రి 10 గంటలు దాటినా దొంగ ఆచూకీ లభ్యం కాలేదు. అంతర్రాష్ట దొంగను కోర్టుకు తరలించే క్రమంలో పోలీసులు ఎలాంటి జాగ్రత్తలు పాటించకపోవడం వల్లే దొంగ పరారైనట్లు కోర్టులో స్థానికులు తెలిపారు.

కోర్టు దగ్గర దొంగ తప్పించుకున్నాడు..

రెండు రోజుల క్రితం పాల డెయిరీలో దొంగతనం చేసిన మురళిని సోమవారం స్టేట్ బ్యాంకు కాలనీలో అరెస్ట్ చేశాం. 41 నోటీస్ ఇచ్చి కోర్టు దగ్గరకు తీసుకెళ్లగా అక్కడ తప్పించుకున్నాడు. మా సిబ్బంది వెతుకుతున్నారు.

-శివభూషణం, హెడ్ కానిస్టేబుల్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్

తప్ప తాగి కారు డ్రైవింగ్

- ఎస్సార్బీసీ కాలువలోకి దూసుకెళ్లిన సుమో
- రైతులు గమనించడంతో తప్పిన పెను ప్రమాదం
- ఆరుగురు విద్యార్థినులతోపాటు బాలిక తండ్రి క్షేమం



ఎస్సార్బీసీ కాల్వలో పడ్డ సుమో కారులో ఉన్న బాలికలను బయటకు తీసుకు వస్తున్న దృశ్యం

బనగానపల్లె, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి కారు నడపడంతో ఎస్సార్బీసీ కాలువలోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న ఆరుగురు విద్యార్థులతో సుమో వాహనం నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయపడ్డారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్టయింది. బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేటకు చెందిన నడిపి నాగయ్య కుమారుడు జక్కు సురేశ్ సోమవారం ఫుల్లుగా మద్యం సేవించాడు. అనంతరం సుమో వాహనం తీసుకొని తన కూతురు సాయిచంద్రిక చదువుతున్న బనగానపల్లె బాలికల ఉన్నత పాఠశాల వద్దకు వెళ్లాడు. 8వ తరగతి చదువుతున్న తన కూతురితోపాటు మరో ఐదుగురు విద్యార్థినులను సుమో వాహనంలో ఎక్కించుకున్నాడు. సుమోలో పాటలు పెట్టి ఎస్సార్బీసీ కాలువ కట్టపై అతివేగంగా నడిపాడు. దీంతో సుమో వాహనం అదుపు తప్పి ఎస్సార్బీసీ కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ విషయం సీఐ ప్రవీణ్‌కుమార్‌కు తెలియడంతో వెంటనే ఎస్సార్బీసీ కాలువ వద్దకు చేరుకున్నారు. అప్పటికే చుట్టుపక్కల ఉన్న రైతులు అక్కడికి చేరుకొని విద్యార్థినులను వాహనం టాప్‌పైకి ఎక్కించారు. ఆ తరువాత ఈత గాళ్లు రావడంతో వారిని తాళ్ల సహాయంతో క్షేమంగా ఎస్సార్బీసీ కాలువ నుంచి బయటకు చేర్చారు. నీరు తక్కువగా ఉండడంతో ఎవరికీ ప్రమాదం సంభవించలేదు. అదృష్టవశాత్తు కాలువలో నీరు తక్కువ పారడం, కారు బోల్తా పడకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని సీఐ తెలిపారు. అనంతరం జక్కు సురేశ్‌పై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సమాజాభివృద్ధిలో మేధావులు భాగం కావాలి

'ఫిరా' జాతీయ ఉపాధ్యక్షుడు జేవీ కృష్ణయ్య



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రజాహితం సంస్థ ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మేధావి వర్గాలు ముందుకు వచ్చి, సమాజాభివృద్ధిలో భాగం కావాలని, ఈ నేపథ్యంలోనే 'ప్రజాహితం వేదిక' అనే సంస్థ కృషి చేస్తుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రేషనలిస్టు అసోసియేషన్ (ఫిరా) జాతీయ ఉపాధ్యక్షుడు జేవీ కృష్ణయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో జేవీ కృష్ణయ్య రాసిన 'హేతువాదం వ్యక్తిగత అభివృద్ధికి, సామాజిక అభివృద్ధికి తోడ్పడుతుందా?' పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో పదవీ విరమణ చేసిన ప్రముఖులతో 'ప్రజాహితం వేదిక' అనే సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా జేవీ కృష్ణయ్య మాట్లాడుతూ వైద్య, విద్య రంగాలతోపాటూ వివిధ రంగాల్లో పదవీ విమరణ చేసిన మేధావులతో ప్రజాహితం వేదిక ఏర్పాటు చేశామని తెలిపారు. తమ వ్యక్తిగత జీవితంలో సంతోషంగా జీవించడంతోపాటు సమాజానికి తాము ఏదైనా చేయాలన్న తలంపు ఉన్న విశ్రాంత మేధావి వర్గాలతో ఈ సంస్థ ముందుకు పోతుందని చెప్పారు. కర్నూలుకు చెందిన న్యాయవాది మురళీమోహన్ కన్వీనర్‌గా, కర్నూలు సర్వజన వైద్యశాల విశ్రాంత వైద్యుడు డాక్టర్ రామగోపాల్ కో కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు.



వంద మీటర్ల పరుగును పరిశీలిస్తున్న ఎస్పీ జి. బిందుమాధవ్



ఒక్క నిమిషం ఊపిరి పీల్చుకుంటూ..



హమ్మయ్య దూకేశా..

ఉద్యోగమే లక్ష్యంగా...

- కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు
- ఆరో రోజు 241 మంది అర్హులు

కర్నూలు క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా అభ్యర్థులు కష్టపడుతున్నారు. కర్నూలు నగరంలోని ఏపీఎస్పీ బెటాలియన్‌లో సోమవారం ఆరో రోజు పోలీసు కానిస్టేబు ళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. ఈ పరీక్షలకు జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ హాజరై పర్యవేక్షించారు. 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. 332 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వీరికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తర్వాత ఎత్తు, ఛాతి ఫిజికల్ కొలతలు నిర్వహించారు. అనంతరం వీరికి నిర్వహించిన ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులు 1,600 మీటర్ల పరుగు పరీక్షలో 269 మంది అర్హత సాధించారు. 100 మీటర్ల పరుగులో 175 మంది అర్హత సాధించగా లాంగ్‌జంప్‌లో 232 మంది అర్హత పొందారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 6వ రోజు 241 మంది అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు క మాండెంట్ సదరన్ రీజియన్ మహేష్ కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.హుశేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగే దొంగ..?

- నగర పాలక సంస్థలో ఏసీని తెచ్చిపెట్టిన వైనం
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



చోరీకి గురైన ఏసీ ఇదే..

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలోని జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ విభాగంలో మాయమైన ఏసీని అక్కడ పని చేస్తున్న ఉద్యోగే దొంగతనం చేశాడని తేలింది. నగర పాలక సంస్థలో ఏసీ చోరీపై ఆంధ్రజ్యోతిలో ఈ నెల 3న వార్త ప్రచురితమైన సంగతి విదితమే. దీంతో సదరు ఉద్యోగి సోమవారం ఉదయమే నగర పాలక ఆవరణలో ఏసీని పెట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగే ఈ పని చేసినట్లు నిర్ధారణకు వచ్చిన అధికారులు ఏసీని యథా స్థానంలో ఉంచాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో గత ఆదివారం ఏసీని చోరీ చేసిన ఉద్యోగి సరిగ్గా వారానికి తిరిగి నగర పాలక సంస్థలో ఆవరణలో దాన్ని తెచ్చిపెట్టాడు.

నిప్పంటుకొని కాలిపోయిన పత్తి

రూ.10 లక్షల నష్టం



నరసాపురంలో కాలిన పత్తి

రుద్రవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాపురం గ్రామంలో సంజీవ్‌కుమార్ అనే రైతు ఆరబెట్టిన పత్తి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కాలిపోయింది. ఈ ఘటన సోమవారం జరిగింది. పత్తి తడిగా ఉంటే ఆరుబయట ఆరబెట్టామని, ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పత్తి కాలిపోయిందని రైతు తెలిపారు. దీంతో ఏడాదంతా చేసిన క ష్టం అగ్నిపాలై సుమారు రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. 20 క్వింటాళ్లను ఆరబెట్టగా సుమారు 10లక్షలు విలువ చేసే పత్తి కాలిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరాడు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

వెల్దుర్తి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన జ్యోతిలక్ష్మి (20) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. జ్యోతిలక్ష్మికి అదే గ్రామానికి చెందిన గొల్ల శంకర ప్రసాద్‌తో వివాహమైంది. భర్త తాగుడుకు బానిసై వేధిస్తుండటంతో ఆమె తాళలేక ఈ నెల 3వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు రోజుల చికిత్స తర్వాత కర్నూలులో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకపోయారు. అక్కడ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. మృతురాలికి ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతురాలి తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

వెల్దుర్తి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పట్టణం ఐజీ నగర్‌కు చెందిన బుడగ జంగాల రవి (30) సోమవారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజుల కింద రవి మద్యం తాగి భార్యతో గొడవ పడటంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. రెండు రోజులుగా భార్య రాకపోవడంతో మనస్తాపానికి గురై సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2027 సంవత్సరం నాటికి కుష్టు వ్యాధిని నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే చేస్తారన్నారు. జిల్లాలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు ఇంటింటికి తిరిగి పరీక్షలు చేసి అవగాహన కల్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డా.ఎల్. భాస్కర్ జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి డా.జి. మల్లికార్జున రెడ్డి, డీపీఎంవోలు జి. విజయప్రకాష్, వై. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కౌన్సిలర్ భర్తకు రిమాండ్

బేతంచెర్ల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన మహిళను వేధించిన కేసులో వైసీపీ కౌన్సిలర్ భర్త నిరంజన్‌ను మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని ఎస్ఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. సంజీవనగర్ కాలనీకి చెందిన ఒక మహిళ తనను నిరంజన్ వేధిస్తున్నాడని గత నెల 25వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని ఆయన తెలిపారు. ఈ మేరకు వైసీపీ కౌన్సిలర్ భర్త నిరంజన్‌పై కేసు నమోదు చేశామని, ఆయన పరారీలో ఉన్నాడని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం పట్టణంలోని పుల్లమ్మ కల్లం వద్ద నిందితుడు నిరంజన్‌ను అరెస్టు చేసి జేసీ కోర్టులో హాజరు పరచగా.. మేజిస్ట్రేట్ నిందితుడిని రిమాండ్‌కు ఆదేశించాడని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

తెలియనితనం...!

- పెట్రోల్‌తో ఆటలాడిన ఇద్దరు చిన్నారులు
- మంటలు వ్యాపించి ఓ బాలుడికి తీవ్ర గాయాలు
- ఆస్పరి మండలం బిల్లేకల్లులో ఘటన



కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న అరవింద్

ఆస్పరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేనితో ఆటలాడుతున్నామో.. దాని ప్రభావమెంతో ఎరుగని పసిపిల్లలు వాళ్లు.. పెట్రోల్‌కు నిప్పు తోడైతే మంటలు చెలరేగుతాయని.. ప్రాణాలకే ప్రమాదం అనే విషయం ఏమాత్రం తెలియని వయసు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లాక ఇంటి సమీపంలో ఆడుకుంటూ రోడ్డు పక్కన ఆపిన మోటర్ బైక్‌లో నుంచి పెట్రోల్ తీశారు. ఓ ప్లాస్టిక్ సీసాలో పెట్రోల్ పోసుకుని ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఓ బాలుడు అగ్గిపుల్ల గీసివేయంతో క్షణాల్లో మంటలు వ్యాపించి ఎనిమిదేళ్ల పసిబాలుడు అరవింద్ శరీరమంతా చుట్టిముట్టాయి. ఈ సంఘటన ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకోగా సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, బాధిత చిన్నారి అరవింద్‌కు వరుసకు సోదరుడైన రామకృష్ణ తెలిపిన మేరకు వివరాలు... బిల్లేకల్లు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, పెద్దయ్య దంపతులకు కుమార్తె పల్లవి, అరవింద్ సంతానం. మద్యానికి బానిసై లక్ష్మీదేవి భర్త పెద్దయ్య ఆరు నెలల క్రితం మృతి చెందాడు. భర్తను కోల్పోయిన లక్ష్మీదేవి అన్నితానై పిల్లలను పోషిస్తోంది. అరవింద్‌ను బడిలో చేర్పించాలని వెళితే ఆధార్ కార్డు లేదని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అడ్మిషన్ ఇవ్వలేదు. అయినా అక్క పల్లవితో కలిసి రోజు బడికి వెళ్లేవాడు. అదే గ్రామానికి చెందిన హెచ్. ఉరుకుంద కుమారుడు వికాస్ నాలుగో తరగతి చదువుతున్నారు. కాగా వికాస్, అరవింద్ ఇద్దరూ మంచి స్నేహితులు. గత శుక్రవారం లక్ష్మీదేవి కూలీ పనులకు వెళ్లింది. అక్కతో పాటు బడికి వెళ్లిన అరవింద్ మధ్యాహ్నం బయటకు వచ్చేశాడు. మిత్రుడు వికాశ్‌తో కలసి ఆడుకుంటూనే.. రోడ్డు పక్కన ఆపిన ద్విచక్ర వాహనంలో (మోటర్ బైక్) నుంచి పెట్రోల్ తీసి.. ఆ పెట్రోల్‌ను చెరో ప్లాస్టిక్ సీసాలో పోసుకొని.. ఆ సీసా మూతకు సూదితో రంధ్రం చేసుకొని ఒకరిపై ఒకరు రంగుల్లాగా చల్లుకున్నారు. ఆ క్రమంలో కింద పడిన పెట్రోల్‌కు అగ్గిపుల్ల వెలిగించి నిప్పు పెడితే అది ఆరిపోయింది. అట్లాగే మనిషిపై పడితే కూడా ఆరిపోతుందనుకొని వికాశ్ అగ్గిపుల్ల వెలిగించి.. అరవింద్‌పై వేశాడని స్థానికుల సమాచారం. మంటలు వ్యాపించడమే కాకుండా, జేబులో ఉంచుకున్న పెట్రోల్ సీసాకు కూడా మంటలు చేరి ఒక్కసారిగా భగ్గుమని శరీరమంతా వ్యాపించాయి. అయితే స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. చిన్నారి వికాశ్ ఏమాత్రం భయపడకుండా ధైర్యంతో నీళ్లు తీసుకొచ్చి అరవింద్ శరీరంపై పోయడంతో మంటలు ఆరిపోయాయి. కూలి పనులకు వెళ్లిన తల్లి లక్ష్మీదేవికి విషయం తెలియడంతో విలపిస్తూ ఇంటికి చేరుకుంది. బంధువుల సహాయంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అరవింద్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, ఇద్దరు పిల్లలు సరదాగా ఆడుకుంటూ ఈ ఘటన జరిగిందని అరవింద్ సోదరుడు రామకృష్ణ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఆస్పరి పోలీస్ స్టేషన్ సీఐ మస్తాన్‌వలి దృష్టికి తీసుకెళ్లగా ఇద్దరు పిల్లలు పెట్రోల్‌తో సరదాగా ఆడుకుంటూ ప్రమాదానికి గురైఅరవింద్ అనే బాలుడు శరీరం కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరారని సమాచారం వచ్చిందన్నారు. ఈ ఘటనపై ఎవరు కూడా ఫిర్యాదు చేయలేదన్నారు.

బావిలో దూకి ఒకరు.. రక్షించేందుకు వెళ్లి మరొకరు

- 80బన్నూరు పొలిమేరలోని బావిలో పడి ఇద్దరి మృతి
- తుమ్మలూరులో విషాదం



ప్రమాదానికి కారణమైన పెద్దబావి ఇదే

మృతి చెందిన లక్ష్మీదేవి, నారాయణ (ఫైల్)

జూపాడుబంగ్లా, పాములపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బావిలో దూకిన మహిళతో సహా కాపాడడానికి వెళ్లిన వ్యక్తి కూడా మృత్యుతవాత పడ్డాడు. ఈ ఘటన సోమవారం మండలంలోని 80బన్నూరు గ్రామ పొలిమేరలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. తుమ్మలూరు గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(48) కొన్నేళ్ల నుంచి కాన్సర్‌తో బాధ పడుతోంది. వైద్య ఖర్చులు పెరిగిపోవడంతో మనస్థాపానికి గురై 80బన్నూరు సోమవారం గ్రామ పొలిమేరలో ఉన్న బావిలో దూకింది. ఇది గమనించిన అదే గ్రామానికి చెందిన తెలుగు లక్ష్మీనారాయణ(44) ఆమెను రక్షించేందుకు బావిలోకి దూకాడు. ఆమెను కాపాడే ప్రయత్నంలో అతను కూడా మృతి చెందాడు. లక్ష్మీనారాయణ మృతదేహం లభ్యం కావడంతో నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం చేయించారు. మహిళ మృతదేహం మాత్రం లభ్యం కాలేదు. ఇరువురు మృతి చెందడంతో తుమ్మలూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

13 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 13 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఎమ్మిగనూరు మండలంలోని టీఎస్ కల్లూరు గ్రామం, కోసిగి మండలంలోని కోసిగి, కౌతాళం మండలంలోని కామవరం, మంత్రాలయం మండలంలోని వగరూరు, పెద్దకడుబూరు మండలం పెద్దకడుబూరు, ఆదోని మండలం జి.హోసలి, గణేకల్లు, హొళగుంద మండలం పెద్ద గొనేహాల్ గ్రామం, కోసిగి మండలం పెండేకల్, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని తడకనపల్లి, కర్నూలు రూరల్‌లోని సుంకేసుల, పత్తికొండ రెవెన్యూ డివిజన్ ఆలూరు మండలం పెద్దహోతూరు, ఆస్పరి మండలంలోని ముత్తుకూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.

16లోపు దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలు, ఈబీసీలకు స్వయం ఉపాధి కల్పించేందుకు జనవరి 8 నుంచి 16వ తేదీ వరకు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సోమవారం తెలిపారు. ఈ మేరకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు జిల్లాలో అర్హులైన బీసీ లబ్ధిదారులకు 1673 యూనిట్లు, ఆర్థికంగా వెనుకబడిన కులాలకు 171 యూనిట్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ యూనిట్ల ఏర్పాటుకు బీసీ కార్పొరేషన్ ద్వారా 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు.

చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసు విచారణ ప్రారంభం

కర్నూల లీగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ వైసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జిగా పని చేసిన చెరుకులపాడు నారాయణరెడ్డి హత్య కేసు విచారణ సోమవారం స్థానిక జిల్లా సెషన్స్ కోర్టులో ప్రారంభమైంది. 2017 మే 21న చెరుకులపాడు నారాయణరెడ్డిపై క్రిష్ణగిరి మండలంలో దాడి జరిగింది. ఈ దాడిలో నారాయణరెడ్డితోపాటు అతని అనుచరుడు సాంబశివుడు కూడా హత్యకు గురయ్యారు. నారాయణరెడ్డి అనుచరుడు కృష్ణమోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు 18 మంది నిందితులపై కేసు నమోదు చేశారు. అయితే.. కేసులో నిందితులుగా పేర్కొన్న ప్రస్తుత పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కప్పట్రాళ్ల బొజ్జమ్మల పేర్లను హైకోర్టు ఆదేశాలతో తొలగించారు. కేసులో నిందితుడుగా ఉన్న ఒక వ్యక్తి మృతి చెందగా.. మిగతా 15 మందిపై సోమవారం విచారణ జరిగింది. కేసులో ఫిర్యాది అయిన కృష్ణమోహన్ ప్రాసిక్యూషన్ తరఫున తన వాంగ్మూలాన్ని కోర్టులో ఇచ్చారు. తదుపరి విచారణకు కేసు వాయిదా పడింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు

దేవనకొండ,జనవరి 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు- బళ్లారి రహదారిపై కప్పట్రాళ్ల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. విద్యుత్‌పనులు చేసేందుకు బీహార్ నుంచి వచ్చిన షకుర్ అనే వ్యక్తి ఆటోలో వెళ్తుండగా ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయపడడంతో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కబడ్డీ విజేత విశాఖపట్నం

రన్నర్ కర్నూలు



విజేత విశాఖపట్నం బాయ్స్‌కు కప్ అందజేస్తున్న కేఈ ప్రభాకర్

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మూల్పూరి రంగారావు స్మారక 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల కబడ్డీ చాంపియన్ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచి డబుల్ క్రౌన్ సాధించింది. రన్నర్‌గా కర్నూలు బాలబాలికలు నిలిచారు. కర్నూలు డీడీపాడు కేఈ ప్రభాకర్ ఫాంహౌస్‌లో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం బాలుర జట్టు కర్నూలుపై 27-25 పాయింట్లతో నెగ్గింది. మూడో స్థానంలో చిత్తూరు, నాల్గవ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో విశాఖపట్నం జట్టు కర్నూలుపై 37-30 పాయింట్లతో విజయం సాధించింది. చిత్తూరు జట్టు తృతీయ స్థానం సాధించింది. విజేతలకు టోర్నమెంటు అధ్యక్షుడు కేఈ ప్రభాకర్, కేవీ సుబ్బారెడ్డి, మల్లికార్జున రెడ్డి టోర్నమెంటు కప్‌ను అందజేశారు. ఈసీఎం నీలకంఠయ్య, మాజీ కబడ్డీ సంఘం కార్యదర్శి రాజశేఖర్ ప్రస్తుత కార్యదర్శి సుభాకర్, డీఎస్‌డీవో భూపతిరావు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతి

కర్నూలు న్యూసిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిధిలో పని చేస్తున్న ఎనిమిది మంది సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనా అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ జడ్పీ సీఈవో నాసరరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జడ్పీ కార్యాలయంలో జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతుల మీదుగా పరిపాలనా అధికారులు నియామక పత్రాలను అందుకున్నారు. కర్నూలు పీఐయూ డివిజన్‌లో పని చేస్తున్న ఎస్. భాగ్యలక్ష్మిని ప్యాపిలి పరిపాలన అధికారిగా పీఆర్ డివిజన్ ఆదోనిలో పని చేస్తున్న ఎం. నాగరాజు స్వామి, పెద్దకడుబూరు ఎంపీడీవో, పీఆర్ డివిజన్ నంద్యాలలో పని చేస్తున్న భరణి కుమారిని ఎంపీడీవో కోవెలకుంట్ల, కర్నూలు పీఆర్ఐ డివిజన్‌లో పని చేస్తున్న ఎంజీ నాగేంద్ర కుమార్‌ను పగిడ్యాల ఎంపీడీవో, మిడ్తూరు ఎంపీడీవోగా పని చేస్తున్న శ్రీరాములు అవుకు ఎంపీడీవో, ఆత్మకూరు పీఐయూ సబ్ డివిజన్‌లో పని చేస్తున్న అబ్దుల్ కలాంబాషాను ఎంపీడీవో జేస్, ఆదోని పీఐయూ సబ్ డివిజన్‌లో పని చేస్తున్న రవీంద్రబాబును ఎంపీడీవో హాలహర్వి, కల్లూరు ఎంపీడీవోలో పని చేస్తున్న ఎస్. హేమలతను కర్నూలు డ్వామా కార్యాలయంలో నియమిస్తూ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

కారు బోల్తా.. ఒకరి మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు
- మృతదేహం వెంట వెళ్తుండగా ప్రమాదం

కోడుమూరు రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తా పడి ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కొత్తూరు వద్ద సోమవారం రాత్రి జరిగింది. కోడుమూరు మండలంలోని కల్లపరి గ్రామానికి చెందిన పెద్దయ్య కర్నూలులో నివాసం ఉంటున్నాడు. ఆయనకు గుండెపోటు రావడంతో బంధువులు ఆసుపత్రికి చేరుకున్నారు. పెద్దయ్య చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతదేహాన్ని అంబులెన్స్‌లో కల్లపరికి పంపించి ఆ వెనుకనే కారులో మిగిలిన కుటుంబ సభ్యులు బయల్దేరారు. అయితే కొత్తూరు వద్ద రోడ్డుపై కుక్క కళేబరం తప్పించబోయి కారు రోడ్డు పక్క పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో పెద్దయ్య బావమరిది కోడుమూరు ఎస్సీ కాలనీకి చెందిన జయన్న (62) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కృపాలమ్మ, కొడుకు గిడ్డయ్య, కూతుళ్లు సులోచనమ్మ, పుష్పావతమ్మ, మనువడు విజయ్(పుష్పావతమ్మ కొడుకు), సోదరి సంతోషమ్మ (మృతుడు జయన్న భార్య) గాయపడ్డారు. వీరిలో గిడ్డయ్య, కృపాలమ్మ, సంతోషమ్మ, విజయ్ అనే నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన చేరుకుని గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెద్దయ్య, జయన్న మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

పరిస్థితి విషమం

హొళగుంద, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : హొళగంద గ్రామానికి చెందిన మల్లమ్మ అనే వృద్ధురాలిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన సోమవారం జరిగింది. మల్లమ్మ హొళగుంద గ్రామ శివారులోని తమ పొలానికి వెళ్తుండగా వెనకవైపు నుండి అతివేగంగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్ళు, కుడి చేయి విరిగిపోయాయి. తలకు సైతం తీవ్రగాయాలయ్యాయి. హొళగుంద పీహెచ్‌సీ కేంద్రానికి తరలించగా పరిస్థితి విషమించడంతో ఆదోని ఏరియా అస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు పోలీసుల ఫిర్యాదు చేశారు.

చైనా వైరస్ పట్ల అప్రమత్తం

● 20 పడకలతో ఐసోలేషన్ వార్డు

● కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆదేశాలు

కర్నూలు హాస్పిటల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): చైనా హెచ్ఎంపీవీ వైరస్ కేసులు దేశంలో వెలుగు చూడడంతో కర్నూలు జీజీహెచ్‌లో అధికారులు అప్రమత్తమయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఐడీ వార్డులో 20 పడకల ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు సోమ వారం సాయంత్రం ఆదేశించారు. వైరస్ వ్యాపించకుండా నిపుణులతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటుతో పాటు, ఐసీఎంఆర్ వైరాలజీ ల్యాబ్ సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే వైరస్‌కు సంబంధించిన రిబావిరిన్ మందులను కొనుగోలు చేయాలని, ఆక్సిజన్ సరఫరా లిక్విడ్ ఆక్సిజన్, హెచ్ఎంపీవీ వైరస్‌పై మంగళారం మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు.

రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి



కార్పొరేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజలు, నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): 19, 20 వార్డులలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కమిషనర్ రవీంద్ర బాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ కాలనీలు ఏర్పడి సంవత్సరాలు గడుస్తున్న పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శివర్గసభ్యులు ఆర్. నరసింహులు, సీహెచ్. సాయిబాబా, మహ్మద్‌రఫి పాల్గొన్నారు.

● 27, 29 వార్డుల సరిహద్దుల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారి నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని, తక్షణమే వాటిని అరికట్టాలని వ్యాపారులు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్న వ్యాపార సంఘం నగర ప్రధాన కార్యదర్శి మహ్మద్ మాట్లాడుతూ గుత్తిపెట్రోలు బంకు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద సుమారు 40 సంవత్సరాల నుంచి వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే ఇటీవల నగర పాలక అధ్వర్యంలో టూవీలర్ పార్కింగ్‌కు టెండరు పిలిచారని అన్నారు. అయితే టెండరుదారులు తమకు నష్టం వచ్చిందని చిరువ్యాపారుల వద్ద నుంచి రోజుకు రూ.500 వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ఈహెచ్ఎస్ ఓపీ సేవలు బంద్

కర్నూలు హాస్పిటల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు సంబంధించి ఈహెచ్ఎస్ (ఎంప్లాయీస్ హెల్త్ స్కీం) ఓపీ సేవలను నిలిపివేస్తున్నట్లు ఏపీ ప్రైవేటు హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (అప్నా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా.ఎన్.వేణు గోపాల్, డా.బీజీ రాహుల్ తెలిపారు. ఈ మేరకు ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డా. భాస్కర్ రెడ్డికి సమ్మె నోటీసును అందజేశారు. ఈనెల 6వ తేదీ నుంచి అప్నా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈహెచ్ఎస్ ఓపీ సేవలు బంద్ చేస్తున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు ఈహెచ్ఎస్ ఓపీ సేవలు నిలిపివే స్తున్నట్లు ప్రభుత్వం నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు విడుదల చేయకపోతే పూర్తి స్థాయి సేవలు నిలిపివేస్తామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి, ఈహెచ్ఎస్ ఓపీ సేవలు నిలిచిపోయిన ఆరోగ్యశ్రీ సేవలు జిల్లాలో కొనసాగుతున్నా యని, రోగులు ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.

రేపు డంప్ యార్డు పరిశీలన

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గార్గేయపురం డంప్‌యార్డులోని నగర పాలక కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని భారత జంతు సంక్షేమ బోర్డు సభ్యులు బుధవారం పరిశీలించనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం గార్గేయ పురం డంప్‌యార్డులోని కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద నివారణకు వీధి కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ చేసే ప్రక్రియను పునఃప్రారంభించేందుకు భారత జంతు సంక్షేమ బోర్డుకు అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నామని, ఆ బృందం ఈ నెల 8న వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తుందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, డీఈఈలు గంగాధర్, శ్రీనివాసరెడ్డి, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు, రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా జనసేన నాయకుడు తోళ్ల మంజునాథ్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో ఏపీ రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జనసేన నాయకులు పీవీబీ సుబ్బయ్య, చింతా సురేష్‌లు మంజునాథ్‌ను అభినందించారు.

డీఐజీని కలిసిన టీడీపీ నాయకులు


డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన టీడీపీ నాయకులు

కర్నూలు రూరల్ జనవరి 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను ఆయన కార్యాలయంలో సోమవారం పంచలింగాలకు చెందిన టీడీపీ నాయకుడు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ముప్పసాని సుధాకర్, గూడూరుకు చెందిన ఫైగేరి, సప్పోగు జయకుమార్, కర్నూలు మండల వైస్ ఎంపీపీ ముప్పాసాని నెహమ్యా ఇమ్మాని యేలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా డీఐజీకి పూల బొకే ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఓటరు తుది జాబితా ప్రచురణ


రాజకీయల పార్టీల ప్రతినిధులకు ఓటరు జాబితా ప్రతులను అందజేస్తున్న ఆర్ఓ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు నియోజకవర్గానికి సంబంధించిన తుది ఓటర్ల జాబితాను అధికారులు ప్రచురించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో అధికారులతో కలిసి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కమిషనర్ రవీంద్రబాబు ఓటర్ల జాబితాను ప్రచురించి, రాజకీయపార్టీల ప్రతి నిధులకు ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఓ మాట్లాడుతూ నియోజకవర్గంలో 258 పోలింగ్ కేంద్రాల వద్ద సంబంధిత బీఎల్ఓలు తమ బూత్ ఓటర్ల జాబితాను ప్రచురించి, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశామన్నారు. కొంతకాలం క్రితం నిర్వహించిన స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా కొత్త ఓటు నమోదు, తొలగింపు ప్రక్రియ అనంతరం నియోజకవర్గంలో 2,74,553 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, ఆర్ఐ రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్యం షాపును తొలగించాలి


మద్యం షాపు ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ఓర్వకల్లు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని ప్రధాన రహదారి పక్కన ఉన్న మద్యం షాపును తొలగించాలని సోమవారం సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు నాగన్న, రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మద్యం షాపు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓర్వకల్లులో ప్రధాన రహదారి పక్కన్న మద్యం షాపు ఏర్పాటు చేశారని, దీంతో ప్రజలు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం షాపు మిద్దూరు ప్రధాన రహదారిలో ఉండటంతో సాయంత్రం రోడ్డుపై వాహనాలు నిలపడం, అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు తప్పతాగి గొడవలు పడుతుండటం, రోడ్డు పక్కనే మూత్రవిసర్జనలు వంటి పనులు చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఓర్వకల్లులోని మ్యదం పాపును తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌యూను నూతన చైర్మన్ సందర్శించాలి

కర్నూలు అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీని ఉన్న విద్యామండలి నూతన చైర్మన్ మధుమూర్తి సందర్శించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్‌యూలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వర్సిటీలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రీసెర్చ్‌లు జరపక వర్సిటీ స్థాయి పడిపోవడంతో విద్యార్థులకు రీసెర్చ్‌లకు అవకాశం లేకుండా పో యిందన్నారు. ఇంజనీరింగ్ కళాశాలకు అధ్యాపకుల కొరత వేధి స్తోందన్నారు. నాయకులు అమర్, మౌలాలీ, సాగర్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు కృతజ్ఞతలు

కర్నూలు అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పేదలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను వారి సొంతం చేస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 22ఏ జాబితా భూములపై నిషేధం ఎత్తివేత నిర్ణయం తీసుకోవడంతో పేదలు సాగు చేసు కుంటున్న భూములకు సర్వహక్కులు దక్కినట్లు అవుతుందని, రైతులకు శాశ్వత భూ హక్కును కల్పించినందుకు కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి హర్షం వ్యక్తం అవుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.88 కోట్ల లక్షల ఎకరాల భూములు ఈ జాబితాలో ఉన్నాయని, త్వరలోనే వాటిపై నిషేధం ఎత్తి వేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించడం అభినందనీయమన్నారు.

నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు

సి.బెళగల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏడీఏ సాలురెడ్డి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నకిలీ పురుగుల మందులు విక్రయించే వ్యాపారులపై క్రిమినల్ కేసు లు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏవో మల్లేష్‌కుమార్, ఎంపీవోలు ఉన్నారు.

రేషన్ డీలర్ల ఇంటర్వ్యూలు వాయిదా

కర్నూలు రూరల్ జనవరి 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు రెవెన్యూ డివిజనల్ పరిధిలో ఈనెల 6న జరగాల్సిన రేషన్ డీలర్ల ఇంట ర్వ్యూలు నిరవధికంగా వాయిదా వేసినట్లు ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి వేణుగోపాల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ డివిజనల్ పరిధిలో ఈనెల 5న రేషన్‌డీలర్ల పోస్టుల కోసం అభ్యర్థులు రాత పరీక్షలు రాసి అందులో 251 మంది అభ్యర్థులు ఉత్తీర్ణులైన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో వారం దరికీ కర్నూలు ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఒక పోస్టుకు ఐదుగురి చొప్పున ఈనెల 6న ఇంటర్వ్యూలకు పిలిచారు. అయితే రెవెన్యూ సదస్సులు, ఇతర అత్యవసర పని ఉన్న కారణంగా ఆ ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా వేసినట్లు ఏవో తెలిపారు.

మధుసుధాకర్‌కు డాక్టరేట్

కర్నూలు అర్బన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో బోటనీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న దండుగుల మధు సుధాకర్‌కు డాక్టరేట్ దక్కింది. మధుసుదాకర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి అభినందించారు. మధుసుదాకర్ శ్రీవెం కటేశ్వర యూనివర్సిటీలో బోటనీ ప్రొఫెసర్ జి సుందర్శనం పర్య వేక్షణలో శేషాచలం కొండలలో ఎంచుకున్న మొక్కల కీమోటాక్స్‌నమిక్ క్యారె క్టరైజేష న్, జీవ సంబంధ కార్యకలాపాలపై అధ్యయనం అనే అంశంపై పరిశో ధన చేసి పీహెచ్‌డీ డిగ్రీని పొందినట్లు వారు తెలిపారు.

బీడీ కార్మికులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

కర్నూలు రూరల్ జనవరి 6(ఆంధ్రజ్యోతి): జోహరాపురం పరిధిలో 19వ వార్డులో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న బీడీ కార్మికులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నిర్మలమ్మ, నగర కార్యదర్శి రాజశేఖర్, అవాజ్ కమిటీ అధ్యక్ష, కార్య దర్శులు ఇక్బాల్‌హుస్సేన్, షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీడీ కార్మికులతో కలిసి వారు ధర్నా చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ కార్మికులు గుడిసెలు వేసుకున్న చోట ఇతర వ్యక్తులు వచ్చి దౌర్జన్యం చేసి కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మీకి సీపీఎం నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు అబ్దుల్‌నహీమ్, రామకృష్ణ, నబీ, ఇంతియాజ్, హుస్సేన్, ఫరూక్, హనీఫ్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆటో అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30, 31 తేదీలలో విజయవాడలోని దాసరి భవన్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులపై అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, యూనియన్ జిల్లా అధ్య క్షుడు మధు, భీమరాజు, రాము పాల్గొన్నారు.

ప్రజా సమస్య పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా


సమావేశానికి హాజరైన ఇన్‌చార్జి తహసీల్దార్ రామాంజనేయులు, వెనుకవైపు ఖాళీగా ఉన్న ఇతర అధికారుల కుర్చీలు

కోడుమూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్య పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా కొట్టారు. ఇన్‌చార్జి తహసీల్దార్ రామాంజనేయులు, విద్యుత్ శాఖ ప్రతినిధిగా లైన్‌మెన్ ఎస్.కే సుభాన్ తప్ప మిగిలిన కుర్చీలు ఖాళీ కనిపించాయి. తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, విద్యుత్, పోలీసు, ఫైర్, సీటిపా రుదల, పీఆర్, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ వంటి సుమారు 25 శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొనాల్సి ఉంది. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు గైర్హాజరైన అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జైన మత గురువు రాజేంద్ర సుర్‌జీ జయంతి

కర్నూలు కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని జైన మతస్థులు మత గురువు రాజేంద్ర సుర్‌జీ 198వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. పాతనగరంలోని మహా శ్వేతాంబర ఆలయం (జైన మందిరం) నుంచి శ్వేతాంబర పూజక్ సంఘం ఆధ్వర్యంలో జైన మతస్థులు రాజేంద్ర సుర్‌జీ చిత్ర పటంతో కూడిన వాహనంతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జైన మత గురువు సాధ్వి మయూర సుర్‌జీ పాల్గొన్నారు.

నిర్వీర్యమవుతున్న వినియోగదారుల క్లబ్

కర్నూలు ఎడ్యుకేషన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వినియోగదారుల కోసం ఏర్పాటైన క్లబులు ఎక్కడ ఉన్నాయని జనతా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కొత్తూరు సత్యనారాయణ గుప్తా ప్రశ్నించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వినియోగదారుల చట్టంపై అవగాహన కలిగించేందుకు పాఠశాలలు, కాలేజీల్లో ఏర్పాటు చేసిన కన్స్యూమర్స్ క్లబ్స్ లక్ష్యం నెరవేరడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి: సీపీఐ

ఓర్వకల్లు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సోమవారం సీపీఐ మండల కార్యదర్శి రమేష్, రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్ వినతి పత్రాన్ని సమర్పించారు. మండలంలోని గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, అలాగే కొమరోలు, సోమయాజులపల్లె వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని తొలగించి నూతన వాటర్ ట్యాంకులు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రవికుమార్ పాల్గొన్నారు.

సర్వేను పూర్తి చేయాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగరంలో పౌర గుర్తింపు సర్వేను పూర్తి చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగర పాలక సమావేశభవనంలో ప్రత్యేక అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, సూపరింటెండెంట్ మంజూర్ బాషా పాల్గొన్నారు.

గోకుల షెడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

సి.బెళగల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గోకుల షెడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో రాణెమ్మ ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో ఉపాధి సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. ఏపీడీ అల్లిపీరా, ఏపీవో రామన్న ఈసీ రంగస్వామి, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ టి.శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు బీ.క్యాంపు, విజ్ఞానమందిరం, అరోరానగర్, శ్రీలక్ష్మీనగర్ ప్రాం తాల్లో కరెంట్ కోత ఉంటుందన్నారు. అలాగే ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు బిర్లాగేట్, ఎండోమెంట్‌కాలనీ, బిర్లాగడ్డ ప్రాంతాల్లో కరెంట్‌కోత ఉంటుందని, ప్రజలు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వాలీబాల్ పోటీలకు ఆర్‌యూ మహిళా జట్టు

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల వాలీబాల్ మహిళా పోటీలు ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జెప్పియార్ విశ్వవిద్యాలయం, చెన్నై, తమిళనాడులో జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాయల సీమ విశ్వవిద్యాలయం వాలీబాల్ మహిళా జట్టు ఈ టోర్నమెం టులో పాల్గొంటుంది. సోమవారం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆర్‌యూ వైస్ చాన్స్‌లర్ ఎన్‌టీకే నాయక్ పాల్గొని క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌యూ ఉప కులపతి మాట్లాడుతూ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం జట్టు వివరాలు ప్రకటిం చారు. రాగిణి, రాజేశ్వరి, బీ.కావ్య, షేక్ ముబాషెరా, (బసిరెడ్డి డీసీ, ఎన్‌డీకే), వి.కళ్యాణి, యు.సుకన్య (సెయింట్ జోసెఫ్, డీసీ డబ్ల్యూ), పి.జుబేదా, ప్రవల్లిక, ఎం.శిరీష (ఆర్‌యూ కళాశాల, కర్నూలు), కేఎం శ్రీలేఖ, హరిత (సెయింట్ జోసెఫ్, డీసీ, కర్నూ లు), ఎం.జయలక్ష్మి, లక్ష్మి (శ్రీసాయికృష్ణ డీసీ, కర్నూలు)లను అభినందించారు. ఆర్‌యూ రిజిస్ట్రార్ బోయ విజయ్ కుమార్ నాయుడు, కేవీ శివకిషోర్, జట్టు మేనేజర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీపీఐ నిరాహార దీక్షలు

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ అధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ధర్నా చౌక్ వద్ద రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం మాట్లా డుతూ ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు పొలాలలో ఇళ్లు నిర్మించుకో వడానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు జి.చంద్రశేఖర్, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

నకిలీ బిల్లులతో నిధులు స్వాహా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కొన్ని ప్రైవేటు హాస్పిటళ్లలో నకిలీ బిల్లులతో ప్రభుత్వ నిధులను స్వాహా చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్ర సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరం లోని ప్రైవేటు ఆసుపత్రులు నకిలీ బిల్లులతో ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నాయని ఆరోపించారు. నకిలీ బిల్లులపై సంతకాలు చేసిన డాక్టర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ శివప్రసాద్, లా కాలేజీ విద్యార్థులు జేఏసీ జనరల్ సెక్రటరీ మహేష్ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి: గోకులం షెడ్ నిధులను అక్రమంగా దారి మళ్లించిన అధికారులపై చర్యలు తీసుకో వాలని కోరుతూ దేవనకొండ గ్రామానికి చెందిన నాగరాజు సోమవా రం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018-19 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద గోకులం షెడ్డు నిర్మించుకున్నామన్నారు. గోకులం షెడ్డు నిర్మాణం కింద రూ.60వేలు మంజూరయ్యాయని, కానీ దేవనకొండ సచివాలయం-1లో పని చేసిన అనుమన్న వెటర్నరీ అసిస్టెంట్ తరుణ్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ అధికారులు ఇద్దరు కలిసి వలంటరీగా పని చేసిన నాగార్జున సాయంతో గోకులం షెడ్డు బిల్లును స్వాహా చేశారు. నిధులు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అర్జీలు పునరావృతం కాకూడదు: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలు పునరావృతం కాకూడదని నగర పాలక కమిషనర్ ఎస్.రవీందబాబు అన్నారు. సమస్యలకు సం బంధించి వచ్చిన అర్జీలను పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, ఎస్‌ఈ రాజశేఖర్, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ సత్యనారాయణ, ఆర్ఓ జునైద్, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గూడూరు: ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలకు సంబంధించి మూడు అర్జీలు రాగా, తహసీల్దార్ వాటిని పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఆవోపా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు


ముగ్గులను పరిశీలిస్తున్న ఆవోపా మహిళా విభాగం ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని పెద్దమార్కెట్ సమీపంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల్లో 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు కర్నూలులోని ఆవోపా మహిళా విభాగం ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల రంగవల్లికలను ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సూర్యకుమారి నేతృత్వంలో జరిగిన ఈ పోటీ ల్లో పదో తరగతి విద్యార్థినులు చరిత, దీపిక, అక్షయ, మధు లతలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమ తులు అందుకున్నారు. అలాగే పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థినికి ఆవోపా మహిళా విభాగం ప్రతినిధులు బహుమతులు అందజే శారు. కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి సరిత, కోశాధికారి శోభ, సభ్యులు లక్ష్మీ సుజాత, సునీత, ఆవోపా అధ్యక్షుడు సురేష్, ఆవోపా రాష్ట్ర వధూవరుల పరిచయ వేదిక చైర్మన్ జవహర్‌బాబు, చీఫ్ కన్వీనర్ నాగేశ్వర రావు, సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

'కంటి జబ్బులపై నిర్లక్ష్యం వద్దు'

కర్నూలు కల్చరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కంటి జబ్బులపై నిర్లక్ష్యం వహించొద్దని కంటి వైద్య నిపుణుడు డాక్టర్ జయప్రకాశ్ అన్నారు. కర్నూలులోని బాల సాయిబాబా జయంతిని పురస్కరించుకొని బాలసాయి కంటి ఆసుపత్రి, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, సందీప్ క్లినిక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కల్లూరులోని ఆదిత్య పాఠశాల ఆవరణలో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు, బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, విశ్వభారతి ఆసుపత్రి రిటైర్డు ప్రిన్సిపాల్ ప్రభాకర్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం. నాగరాజు, ఆదిత్య పాఠశాల కరస్పాండెంట్ బి. వాసుదేవయ్య, నరసింహయ్య పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మొరుసు తరలిస్తే చర్యలు

సి.బెళగల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా మొరుసును తరలిస్తే చర్యలు తీసుకుంటామని కోడుమూరు సీఐ తబ్రేజ్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పోలకల్లు, కొం డాపురం, సి.బెళగల్, బ్రాహ్మణదొడ్డి, క్రిష్ణదొడ్డి, సంగాల, చింతమా నుపల్లె గ్రామాల్లో అక్రమంగా ఎర్ర మొరుసును తరలిస్తున్నట్లు రైతులు కోడుమూరు సీఐకు విన్నవించుకున్నారు. కోడుమూరు సీఐ తబ్రేజ్ మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఎర్రమొరుసు తరలించే ట్రాక్టర్ల నంబర్లు తమకు తెలియజేయాలన్నారు. అనంతరం ఆయన సి.బెళగల్ పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు.

నేడు సీపీఎం నిరసన

కర్నూలు న్యూసిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

మిడుతూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మిడుతూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పూర్వ విద్యార్థులు సోమవారం 20 సంవత్సరాల తరువాత ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2004- 2005 సంవత్సరంలో పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు గడిచిన తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలను ఎదిగినందుకు ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులుగా పాఠశాల హెడ్ మాస్టర్ సాయితిమ్మయ్య, శేషయ్య, బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువుకు నీరు అందించాలి



సీపీఐ, సీపీఎం నాయకులతో మాట్లాడుతున్న గోల్డ్ మైండ్స్ పీఆర్వో రామ్మోహన్ రెడ్డి

తుగ్గలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : జియో మైసూరు కంపెనీ హంద్రీ నీవా కాలువ నుంచి నీరు తీసుకెళ్తున్న పైపులైన్ ద్వారా జొన్నగిరి చెరువుకు వాల్ ఏర్పాటు చేసి నీరు అందించాలని సీపీఎం, సీపీఐ నాయకులు కోరారు. సోమవారం జొన్నగిరిలో వాల్మీకి విగ్రహం వద్ద జియో మైసూరు కంపెనీ పీఆర్వో రామ్మోహన్ రెడ్డితో సీపీఎం, సీపీఐ నాయకులతో పాటు ప్రజలు మాట్లాడారు. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు 16 కి.మీల మేర పైపులైన్ వేసి ప్రాజెక్టుకు నీరును తీసుకెళ్తున్నామని, ఆ పైపుకు వాల్ ఏర్పాటు చేస్తే ప్రాజెక్టుకు నీరు అందవని, దీని వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని అన్నారు. ప్రజల దాహార్తి తీర్చడం కోసం ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని తెలిపారు. అయితే సీపీఐ, సీపీఎం నాయకులు నిరాకరించడంతో ఈ విషయంపై కంపెనీ యజమాన్యం దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు పులికొండ నాయక్, సీపీఎం నాయకులు శ్రీరాములు, కొండారెడ్డి, రంగారెడ్డి, సీపీఐ నాయకులు నబీరసూల్, సుల్తాన్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మహిళకు పాము కాటు

తుగ్గలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : తుగ్గలి గ్రామానికి చెందిన హరిచంద్రుడు భార్య రాణి కంది పంట కోస్తుండగా.. పాము కరిచింది. కుటుంబ సభ్యులు గుర్తించి తుగ్గలి వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలి

మద్దికెర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే తల్లిదండ్రుల సహకారం అవసరమని మండల విద్యాధికారి రంగస్వామి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో తల్లిదండ్రులు, పాఠశాల అభివృద్ధి అనే అంశంపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి దిశలో నడవాలని ఉద్దేశంతో మంత్రి నారా లోకేశ్ అభివృద్ధి కార్యక్రమాల్లో తల్లిదండ్రులను భాగస్వాములు చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు మధ్యాహ్న భోజనం కూడా పరిశీలించుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే పాఠశాలలు అ భివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బొల్లాపురం చంద్ర, హెచ్ఎం శ్రీనివాసులు, అరవ శ్రీనివాసులు ఉన్నారు.

చెరువులో పట్టాలు రద్దు చేస్తాం

మద్దికెర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడవలి గ్రామంలో గొంది వెంకన్న చెరువులో పొందిన పట్టాలను రద్దు చేస్తామని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ తెలిపారు. సోమవారం ఎడవలి గ్రామంలో ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రామాంజులు గ్రామానికి వెళ్లి చెరువును పరిశీలించి, చెరువులో పట్టాలు పొందిన వారిని విచారించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్వోఆర్, 1బీ, అడంగల్ అన్ని రికార్డులు పరిశీలించామని, ఆ సర్వే నెంబర్లన్నీ చెరువువే అన్నారు. చెరువులో పట్టాలు ఇవ్వడానికి లేదని తెలిపారు. వంక పోరంబోకు గానీ, చెరువుల్లో కాని పట్టాలు పొందితే రద్దు చేస్తామని అన్నారు. జిల్లా అధికారులకు పట్టాలు రద్దు చేయాలని నివేదికలు పంపుతామన్నారు.

ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న కాలనీవాసులు

మద్దికెర, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశువుల వైద్యశాల వెనుక భాగంలో కాలనీకి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి బండలు పాతారని, వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు కాలనీవాసులు ధర్నా చేపట్టారు. కాలనీవాసులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆ ప్రభుత్వ స్థలం గుండా రాకపోకలు సాగించామని, ప్రభుత్వ కార్యాలయాలు సెలవు ఉన్న రోజున అడ్డంగా బండలు పాతడం వల్ల రాకపోకలు నిలిచిపోయాయని అన్నారు. రూ.లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ హుశేన్‌సాహేబ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సాంబశివుడు, రంగస్వామి, భీమరాజు, వేణు తదితరులు ఉన్నారు.

సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి



అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వసుంధర, సర్వేయర్స్ శ్రీనివాసరాజు, వేణుసూర్య, డీఎల్పీవో నూర్జహాన్, హౌసింగ్ డీ2 రవి కుమార్, డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్వరులు, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ షఫీ వుల్లా పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

దేవనకొండ, జనవరి6 (ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన పంటలకు ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో సురేష్‌బాబు తెలిపారు. మండలంలో 7 వేల ఎకరాలలో పంటలు సాగు చేస్తే, 2500 ఎకరాలు మాత్రమే ఈకేవైసీ చేశామపి తెలిపారు. దాదాపు 750 మంది రైతులు పెండింగ్ ఉన్నారని, వారు వెంటనే రైతుసేవా కేంద్రాలలలో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని సూచించారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టాలి

● ప్రజల ఆస్తులకు రక్షణ లేదు
● మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆదోనిలో వరుసగా జరుగుతున్న అక్రమ భూ రిజిస్ట్రేషన్‌లపై విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల కిందట మండగిరి పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 321-ఏలో బతికున్న భూ యజమాని చనిపోయినట్లు డెత్ సర్టిఫికెట్ సృష్టించి రూ. కోట్ల విలువచేసే ఆస్తిని అధికార పార్టీకి చెందిన నాయకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. ప్రజలు మార్పు కావాలని ఎక్కడో ఉన్న వ్యక్తికి ఓట్లు వేసి గెలిపిస్తే ఇదేనా మీరు చేస్తున్న మార్పు అంటూ ఎమ్మెల్యే పార్థసారధిని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే భూ కబ్జాలకు పాల్పడితే తోలు తీస్తా.. అంటూ ప్రగల్భాలు పలికి మీ పక్కనే ఉన్న ఓ వ్యక్తి ఆధార్ కార్డునే మార్పు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటే తోలు ఎందుకు తీయలేదన్నారు. తమ హయంలో జరిగిన అక్రమాలపై ఏ ఒక్కటి నిరూపించలేదన్నారు. కూటమి నాయకులు అక్రమ రిజిస్ట్రేషన్‌లు భూదందాలపై నోరు తెరవాలని అన్నారు. డెత్ సర్టిఫికెట్‌తో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను రద్దుచేసి బాధితులుకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం ముందు దర్నా చేపడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, చంద్రకాంత్ రెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

క్రిమినల్ కేసు నమోదు చేయాలి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆదోని, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆదోని పట్టణం మండగిరి గ్రామ పంచాయతీ పరిధిలో ఓ వ్యక్తి మరణించారని నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు అజయ్ బాబు, సుదర్శన్ లక్ష్మిరెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మండగిరి గ్రామ పంచాయతీ శిల్పా ఎస్టేట్ పక్కన సర్వే నెంబరు 321/ఏ లోని 6.51 ఎకరాలు ఎగంటి ఈశ్వరప్ప పేరు మీదు ఉన్న సాగు భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు ఆయన మరణించాడని నకిలీ సర్టిఫికెట్‌లు సృష్టించి స్థానిక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఆదోని ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు డా రవికిరణ్ తన ఇంటి స్థలం పక్కన ఖాళీ స్థలం ఉందని, ఆధార్ కార్డు మార్ఫింగ్ చేసి రూ.1.80 కోట్ల విలువ చేస్తే స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. రిజిస్ట్రేషన్లకు సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బసాపురం గోపాల్, సుదర్శన్, షేక్షావలి, మెకానిక్ వలి కొత్తూరు గంగన్న పాల్గొన్నారు.

వారిపై విచారణ చేపట్టాలి

● మాదాసి, మాదారి ఎస్సీ కురువ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమలింగడు



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు

పత్తికొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కుల జాబితాలో ఉంటూ క్రిస్టియన్లుగా మతాన్ని స్వీకరించిన వారిపై సమగ్ర విచారణ చేపట్టి, వారిని జాబితా నుంచి తొలగించాలని మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమలింగడు, నియోజకవర్గ అధ్యక్షుడు బ్రహ్మయ్య అధికారులను కోరారు. సోమవారం స్థానిక ఆర్డీవో భరత్ నాయక్‌కు మాదాసి, మాదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీలుగా జాబితాలో ఉంటూనే క్రైస్తవులుగా జీవనం అనేక మంది సాగిస్తున్నారని, ఎస్సీలకు వస్తున్న ప్రభుత్వ పథకాలను లబ్ధి పొందుతున్నారని, అటు ప్రజలను, ఇటు ప్రభుత్వాలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకుని చర్చిల్లో పాస్టర్లుగా కొనసాగుతున్నారని, అలాంటి వారిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో బహిరంగ విచారణ అనంతరం కులగణన జాబితాను ప్రచురించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మైలర్ రాముడు, పుచ్చకాయలమడ రాముడు, మంకే లక్ష్మన్న, సుంకన్న, హోసూరు రవికుమార్, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

మాదాసి కురువలను ఎస్సీలుగా గుర్తించాలి

తుగ్గలి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మాదాసి కురువలను బీసీలు కింద కాకుండా ఎస్సీలుగా గుర్తించాలని మాదాసి కురువల సంఘం నాయకులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావేదికలో మాదాసి కురువలను ఎస్సీలుగా గుర్తించాలని వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ మాదాసి కురువలందరికీ ఎస్సీ సర్టిఫికెట్లు ఇచ్చి ఎస్సీలుగా గుర్తించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నాగభూషణం తదితరులు ఉన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, విద్యార్థి సంఘం నాయకులు

ఆదోని, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం ధనాపురం గ్రామం నుంచి హొళగుంద వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పరిగెల మురళీకృష్ణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం ఆలూరు నియోజకవర్గం హొళగుంద మండలం హెబ్బటం గ్రామం నుంచి డనాపురం 20కిలో మీటర్ల వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ గారి ఆధ్వర్యంలో ఒక్కరోజు పాదయాత్ర చేపట్టారు. పరిగెల మురళీకృష్ణ మాట్లాడుతూ రోడ్డు కోసం పోరాటాలు చేస్తున్నామని, ప్రభుత్వ అధికారులు ప్రతి రోజు ఈ రోడ్డు గుండా ప్రయాణాలు చేస్తున్నా వారికి చీమ కుట్టినట్టు కూడా లేదని అన్నారు. రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేసినా కాంట్రాక్టర్లు ఎందుకు పనులు చేయలేదని ప్రశ్నించారు. ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ చిప్పగిరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలన్నారు. సీపీఎం నాయకులు హనుమంతు, నారాయణ స్వామి మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం కోసం పాదయాత్రతో ఆగిపోదని, రాబోయే రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే నిరసన, నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ గారికి వినతిపత్రాన్ని అందించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జీలు ఎం కాసింవలి, జీ రమేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు వినోద్ కుమార్, దిలీప్ డోక కలందర్, సాయినాథ్, వెంకటేష్ కూటమి నాయకులు హనుమంతు, నారాయణస్వామి పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలకు కృషి చేయాలి

● డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి

ఆదోని అగ్రికల్చర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులంతా కలిసికట్టుగా నిరంతరం కృషి చేయాలని డిప్యూటీ ఈవో వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పదో తరగతి బోధిస్తున్న డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు మున్సిపల్ హై స్కూల్, నెహ్రూ మెమోరియల్ హై స్కూల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సబ్జెక్ట్ నిపుణులతో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలకు కేవలం 73 రోజులు మాత్రమే ఉన్నాయని, సమయాన్ని వృథా చేయకుండా విద్యార్థులను చదువులపై దృష్టి సాధించేలా అవగాహన కల్పిద్దామన్నారు. ఈ నెలాఖరులోపు సిలబస్ పూర్తి కాకపోతే పూర్తి చేయాలని సూచించారు. వెనుకబడిన సి గ్రేడ్ విద్యార్థులను దత్తత తీసుకోవాలన్నారు. సబ్జెక్ట్ నిపుణులు బోధించిన అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, హెచ్ఎం హలీం సిద్ధికి, రిసోర్స్ పర్సన్ భాస్కర్ పాల్గొన్నారు.

చౌక దుకాణాల డీలర్ల ఇంటర్వ్యూలు వాయిదా

పత్తికొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ డివిజన్‌పరిధిలోని 31 చౌకదుకాణాల డీలర్ల ఇంటర్వ్యూలు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆర్డీవో భరత్‌నాయక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 5వతేదీ డీలర్ల నియామకానికి సంబంధించి నిర్వహించిన పరీక్షలలో 116 మందిని ఇంటర్వ్యూలకు ఎంపిక చేశామన్నారు. సోమవారం అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచామని, అయితే రెవెన్యూ సదస్సులు ఉండడంతో ఇంటర్వ్యూలను తాత్కాలికంగా వాయిదా వేశామని, త్వరలో ఇంటర్వ్యూల తేదీని వెల్లడిస్తామని తెలి

ఎస్సీ సర్టిఫికెట్లు తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఎస్సీ సర్టిఫికెట్ తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది డిమాండ్ చేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో మాదాసి, మాదారి కురువలు లేరని, అయితే బీసీలుగా పరిగణలో ఉన్న కురువలు రాజకీయ లబ్ధి కోసం ఎస్సీ సర్టిఫికెట్లను తీసుకుంటున్నారన్నారు కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ నరసింహులు, నాయకులు తాయప్ప, సాయిరామ్ పాల్గొన్నారు.


ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని భిక్షాటన



ఆదోనిలో భిక్షాటన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 3580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని సోమవారం ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు భిక్షాటన చేపట్టారు. స్థానిక మున్సిపల్ మెయిన్ రోడ్ నుంచి అర్ధనగ్నంగా ప్లేట్లు పట్టుకొని ప్రతి దుకాణానికి వెళ్లి విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని భిక్షాటన చేశారు. భీమాస్ కూడలిలో చేపట్టిన నిరసనలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా రూ. కోట్ల బకాయి పెట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆరు నెలలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దస్తగిరి లింగప్ప, శ్రీకాంత్, శేఖర్, మోహన్, శివ, హుసేని, రంగా, అరుణ్, సందీప్, వీరేష్ పాల్గొన్నారు.

టీడీపీ కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం



ఈశ్వరప్ప కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న టీడీపీ నాయకులు రంగస్వామి నాయుడు, రామస్వామి

ఆదోని , జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కుటుంబ సభ్యులకు ఎప్పుడూ అండగా ఉంటామని టీడీపీ సీనియర్ నేత రంగస్వామి నాయుడు, ఎల్డీ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ రామస్వామి అన్నారు. సోమవారం టీడీపీ నాయకులైన ఈశ్వరప్పకు చెందిన 6.51 ఎకరాల పొలాన్ని నకిలీ డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్ చేయించడం ఏమిటని ప్రశ్నించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. భూమిని కబ్జా చేసిన వ్యక్తులను వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బాబు నాయుడు, చౌదరి, బసాపురం రామస్వామి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం కూరగాయలతో మంచి ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న అధికారులు

పత్తికొండ టౌన్, జనవరి 6 (ఆంధ్ర జ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరల వాడకం వల్ల మంచి ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని, ఆ దిశగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సాగుకు రైతులు ముందుకు రావాలని రైతు సాధికార సంస్థ పత్తికొండ మండల ఏపీసీఎన్ఎఫ్ మల్లికార్జున అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణం ముందు ప్రజల భాగస్వామ్యంతో పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులైన టమోటా, పచ్చిమిర్చి, ముల్లంగి, క్యారెట్‌లతో పాటు ఆకుకూరలను అమ్మకం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు అక్కడకు వెళ్లి కూరగాయలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో రైతుసాధికార సంస్థ సభ్యులు ఆదెప్ప, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శోభ మృతి తీరని లోటు

పత్తికొండ టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు శోభ మృతి చెందడం అంగన్‌వాడీ ఉద్యమానికి తీరని లోటు అని సీఐటీయూ మాజీ నాయకులు శేఖర్, వెంకటేశ్వర రెడ్డి, మండల కార్యదర్శి గోపాల్, సీనియర్ నాయకులు దస్తగిరిలు అన్నారు. పందికోన గ్రామ అంగన్‌వాడీ టీచర్ శోభ సోమవారం మృతి చెందడంతో ఆమె భౌతిక కాయానికి సీఐటీయు నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రమ, లక్ష్మి, వీరమ్మ, వెంకటమ్మ, మునెమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో అభివృద్ధి

హాలహర్వి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) :విరుపాపురం గ్రామంలో పంచాయతీ నిధులతో గ్రామాభివృద్ధి పనులు చేపడుతున్నామని గ్రామ సర్పంచ్ మోక సిద్దమ్మ అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ డ్రైనేజీలు, తాగునీటి పైపులు ఏర్పాటు చేశామని కూటమి ప్రభుత్వం వల్లే నిధులు మంజూరు చేయడం జరుగుతోందని, మరింత అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం పంచాయతీ నిధులతో డ్రైనేజీ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి మంజునాథ్, మల్లికార్జున పాల్గొన్నారు.

రబీకి సాగు నీరందిస్తాం

హాలహర్వి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : రబీలో ఎల్ఎల్సీ ఆయకట్టు రైతులకు సాగు నీరు అందిస్తాం అని ఎల్లెల్సీ ఈఈ నారయణనాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రబీ సాగుకు చివరి ఆయకట్టు వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీరందస్తామని తాగునీటికి సైతం ఈఏడాది ఇబ్బంది ఉండదని పుష్కలంగా తాగునీటి కోసం రిజర్వాయర్‌లు నింపుకోవాలని తెలిపారు.

జాతీయ రహదారి నిర్మాణం పూర్తి చేయాలి

ఆలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు పట్టణంలోని నిర్మాణం దశలో నిలచిపోయిన జాతీయ రహదారి నిర్మాణం పనులను పూర్తి చేయాలని బీఎస్పీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ రామలింగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి పనులు నిలచిపోవడం వల్ల రహదారి గుంతలమయంగా మారి దుమ్ము, ధూళితో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఆలూరు నియోజకవర్గంలో ప్రజా ప్రతినిధులు ఎం చేస్తున్నారని ప్రశ్నించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం నిర్వహించాలి

ఆలూరు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండల పరిషత్ కార్యాలయం ముందు ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం పాటలు నిర్వహించాలని సీపీఎం నాయకులు నారాయణ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి రెండేళ్ల పూర్తయినా ప్రారంభించడం లేదన్నారు. వేలం పాటలను నోటిఫికేషన్ జారీ రద్దుచేసి ఇంతర వరకు తిరిగి వేలం పాటలకు నోటిఫికేషన్ విడుదల చేయలేదని, వెంటనే అధికారులు వేలం పాటు నిర్వహించాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన కురువ, కురుమ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్



రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉదయ్ కుమార్

ఆస్పరి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : కురువ, కురుబ, కురుమ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన కేసీ ఉదయ్ కుమార్ సోమవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రకార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రామదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, జనసేన పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు చింత సురేష్ సమక్షంలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఉదయ్ కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో రాష్ట్ర డైరెక్టర్‌గా ఎన్నుకున్న టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పురోభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు అరవింద్ కుమార్, అంజి పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా తనిఖీలు

దేవనకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ దుకాణాలను డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పర్వీనా తూతూ మంత్రంగా తనిఖీలు చేశారు. మెడికల్ దుకాణాలు, ఆర్ఎంపీ క్లినిక్‌ల తనిఖీల కోసం సోమవారం సాయంత్రం దేవనకొండకు వచ్చారు. అధికారి వస్తున్నారని ముందే తెలుసుకున్న మెడికల్ దుకాణాలు, ఆర్ఎంపీ కీనిక్‌ల దుకాణాలను మూసివేశారు. దీంతో చేసేదిఏమి లేక డ్రగ్స్‌ఇన్‌స్పెక్టర్ వెనుతిరిగి వెళ్లారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్ఎస్ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం నందవరం మండలాలలో తుంగభద్ర నది పరివాహక ప్రాంతాలలో జరుగుతున్న ఇసుక అక్రమాలపై విచారణ చేపట్టాలని బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రామతీర్థం అమ్రేష్, జిల్లా కార్యదర్శి ప్రసన్న కుమార్ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల్లో ఇసుక కాసుల వర్షం కురిపిస్తుందన్నారు. ఒక్కో ఇసుక ట్రాక్టర్‌కు నెలకు పోలీసులు, రెవెన్యూ యంత్రాంగానికి రూ.30వేలను దళారులు మామూళ్లు చెల్లిస్తున్నారన్నారు. సామాన్యులకు ఇసుక అందుబాటులో లేకుండా పోయిందని వెంటనే దీనిపై విచారణ చేపట్టి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలని కోరారు.

గజ వాహనంపై ప్రహ్లాదరాయలు



గజ వాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనం పై భక్తులకు దర్శనం ఇచ్చారు. ధనుర్మాసం సోమవారం సప్తమిని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్ కాంతుల మధ్య గజవాహనం ఊరేగుతుండగా భక్తులు జయహో... గురు రాఘవేంద్ర.. విజయహో.. అంటూ పెద్దఎత్తున జయధ్వనులతో మఠం ప్రాంగణం మార్మోగింది. పండితులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.

మఠం దైనందిక సేవకు విరాళం

మంత్రాలయం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన నాగరాజు, చెన్నైకు చెందిన రఘునందన్ అనే భక్తులు రూ.2లక్షలు దైనందిక సేవకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజరు వెంకటేష్ జోషి తెలిపారు. సోమవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.2లక్షలు నగదును విరాళం ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబానికి శ్రీమఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, నరసింహ దేశాయ్, జేపీ స్వామి, గిరిధర్, శ్రీపాదాచార్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

మంత్రాలయం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం వద్ద తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఎస్.రవి తెలిపారు. సీజ్ చేసిన ట్రాక టర్లను వీఆర్వో భీమన్నగౌడు, వీఆర్ఏ నరసప్పకు బాధ్యత అప్పగించారు. అయితే.. అక్రమ ఇసుక ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్నత పాఠశాల మైదానంలో ఉంచారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ బీజీగా ఉండటంతో ట్రాక్టర్ల యజమానులు తమ ట్రాక్టర్లను తీసుకొని పరారయ్యారు. సాయంత్రం వరకు సీజ్ చేసిన ట్రాక్టర్లు ఆచూకి కోసం వీఆర్ఏలు, వీఆర్వోలు ప్రయత్నించారు. మంగళవారం ట్రాక్టర్లను తీసుకువ స్తామని, యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశభద్రతలో యువత పాత్ర కీలకం

కోసిగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): దేశ భద్రతలో యువత పాత్ర కీలకమని దేశభద్రత కోసం యువత నడుం బిగించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి అన్నారు. సోమవారం కోసిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో దేశ భద్రత, యువత పాత్ర అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, వీటికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సోము, నాయుడు, వీరేష్, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల విచారణ



బైలుప్పలలో పింఛన్‌దారులను విచారిస్తున్న సర్వే బృందం

గోనెగండ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కదలేక మంచానికి పరిమితమైన రోగులకు ఇచ్చే పింఛన్ లబ్ధిదారుల సర్వే సోమవారం మండలంలో జరిపినట్లు సర్వే బృందం సభ్యులు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్ తెలిపారు. మంచానికి పరిమితమైన రోగులకు నెలకు రూ. 15వేలు పింఛన్ అందజేస్తుంది. దీన్ని కొన్ని గ్రామాలలో తప్పుడోవ పట్టించారని ఫిర్యాదులు అందడంతో సోమవారం మండలంలోని బైలుప్పల, గోనెగండ్ల, వేముగోడు, చిన్న మరివీడు, తిప్పనూరు, అలువాల, ఒంటెడుదిన్నె పెద్దనేలటూరు, కుర్నూరు. తదితర గ్రామాలలో పర్యటించి లబ్ధిదారులను విచారించారు. మండల వ్యాప్తంగా 18 మంది నెలకు రూ. 15 వేలు పింఛన్ తీసుకున్నట్లు తెలిపారు. సర్వే వాస్తవాలను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మణిమంజరి, పంచాయతీ కార్యదర్శి సతీష్, వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ చంద్రమోహన్

కోసిగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కోసిగి మండల పరిధిలోని కడిదొడ్డి గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వెనుకాల కౌతాళం మండలం కరిణి గ్రామానికి చెందిన ఆకుల నరసన్న తన బైక్‌పై 15 అక్రమ కర్ణాటక మద్యం బాక్సులు తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేస్తున్నారు. బైక్‌ను సీజ్ చేసి నరసన్నపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే కోసిగిలోని వాల్మీకి సర్కిల్ సమీపంలో కరిణి గ్రామానికి చెందిన బోయ మాదేవ, కడిదొడ్డి గ్రామానికి చెందిన నాగేంద్ర 3 అక్రమ కర్ణాటక మద్యం బాక్సులు తీసుకువస్తుండగా.. మద్యం బాక్సులను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామని కోసిగి ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. రెండు కేసుల్లో కలిపి ముగ్గురుపై కేసు నమోదుచేయగా.. కడిదొడ్డికి చెందిన నాగేంద్ర పరారైనట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో ఏఎస్ఐ నాగరాజు, తిరుపాల్ నాయక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పూలచింతలో పారిశుధ్య పనులు

నందవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పూలచింత గ్రామంలో సోమవారం సర్పంచ్ అక్కామాంబదేవి, బండే గురుస్వామి ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో పూడిక తీయించారు. దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. మండ లంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్ల కుండా చూడాలన్నారు.

సమస్యలు కొన్ని..

● ఆదోని మండలం పెసల బండ గ్రామానికి చెందిన గంగమ్మకు సంబంధించి సర్వే నెంబరు 335/బీలో 3.22, 335/సీలో ఒక ఎకరా మొత్తం 4.22 ఎకరాల భూమి ఉండగా ఆన్‌లైన్‌లో 2.80 ఎకరాల మాత్రమే చూపిస్తుందని, విచారణ చేసి మిగిలిన భూమిని ఆన్‌లైన్ లో నమోదు చేయాలని కోరారు.

● ఆదోని మండలం నాగలాపురం గ్రామానికి చెందిన లక్ష్మికి సంబంధించి సర్వే నంబరు 638లో ఒక ఎకరా భూమి డీ పట్టా ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రస్తుతం సదరు భూమి ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా ఉందని, విచారణ చేసి నా పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని కోరారు.

● నా వయసు 60 సంవత్సరాలు పైబడి ఉందని, ప్రస్తుతం ప్రభుత్వ ఫించన్ మంజూరు చేయాలని కౌతాళం మండలం కమవ రం గ్రామానికి చెందిన శివలింగప్ప అర్జీ సమర్పించారు.

● మంత్రాలయం మండలం కల్లుదేవకుంట గ్రామానికి చెందిన రామలింగప్ప సంబంధించి సర్వే నెంబరు 42ఏ 2బీ1లో 1.80 ఎకరాల భూమికి సర్వే చేసి హద్దులు చూపించాలని సబ్ కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. కార్యక్రమంలో ఏవో వసుంధర, సర్వేయర్లు శ్రీనివాసరాజు, వేణుసూర్య, డీఎల్పీవో నూర్జహాన్, హౌసింగ్ డీఇ రవి కుమార్, డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ షఫీఉల్లా పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో అభివృద్ధికి కృషి

రెండు కొత్తబస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



ఆర్టీసీ డిపోలో కొత్తబస్సులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపో అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డీఎం అమర్‌నాథ్ ఆధ్వర్యంలో రెండు కొత్త బస్సులకు ఎమ్మెల్యే పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్టీసీ డిపోను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. దీంతో ఈ ప్రాంతంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మిగనూరు డిపోకు 19 బస్సులు కొత్త బస్సులు తీసుకొచ్చామన్నారు. అలాగే మరో 10నుంచి 15బస్సులు తీసుకొస్తామన్నారు. వైజాక్ లాంటి పట్టణాలకు కనెక్టివిటి పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం ప్రారంభిస్తున్న రెండు బస్సులు గూడూరు రూట్, మరొకటి శ్రీశైలం రూట్‌కు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అల్తాఫ్, సోమేశ్వర రెడ్డి, సలీం, బడేసాబ్, కనికే నాగరాజు, నరసింహులు, నవాజ్, అంబేడ్కర్ శీను, బచ్చాల రంగన్న, ఆర్టీసీ సిబ్బంది శ్రీనివాసులు, ముస్తాక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు పనులు పూర్తి చేయాలి: సీపీఎం



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివన్న నగర్‌లో అసంపూర్తిగా ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం నాయకులు రాముడు, కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం అసంపూర్తిగా ఉన్న ట్యాంకును వారు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి ట్యాంకు పనులు నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయన్నారు. దాదాపు 20వేల మందికి తాగునీటి అవసరాలకు ఉపయోగపడే ట్యాంకును త్వరితగతిన పూర్తి చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఎమ్మెల్యే స్పందించి వెంటనే పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహిన్, సుభాన్, రఫీక్, శంకరన్న, షేక్‌షావలి పాల్గొన్నారు.

సమష్టి కృషితో భూ సమస్యలు పరిష్కారం

మంత్రాలయం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో రైతుల భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, గ్రామసర్వేయర్లు, మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రీసర్వే జరిగిన గ్రామాలు, రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకున్న రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు జీకే గురురాజరావు, మండల సర్వేయర్ అశోక్ , విజయరామిరెడ్డి, ఆర్ఐ ఆదాం, వీఆర్వోలు భీమన్నగౌడు, ఆనంద్, నరసప్ప, భీముడు, రాజు, శ్వేత,నవీన్ కుమార్, చిట్టి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం



ఏడీఏ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు

ఎమ్మిగనూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం పంటలు సాగు చేయాలని ప్రజాభాగస్వామ్య సంస్థ ఎంటీ పద్మ తెలిపారు. ఎమ్మిగనూరు మండల పరిధిలోని కలుగొట్ల, కే తిమ్మాపురం గ్రామాల్లో పజలభాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం చేసి పంటలు పండించిన రైతుల ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని స్థానిక ఏడీ ఏ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వీవో పాల్గొన్నారు.

ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి: ఎస్ఎఫ్ఐ

ఎమ్మిగనూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఎంఈవో- 2 మధుసూదన్ రాజుపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు రంగప్ప, జిల్లా కమిటీ సభ్యులు రామకృష్ణ, అమర్ కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంఈవో -2పై జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతనెల 11న ఎమ్మిగనూరు మండలం పార్లపల్లిలో విద్యార్థినిని ఎంఈవో కొట్టారన్నారు. దీన్ని కప్పి పుచ్చుకునే క్రమంలో విద్యార్థినిపై తప్పుడు ఆరోపణలు చేయటం దారుణమన్నారు. విచారణకు వచ్చిన అధికారులు సైతం పాఠశాలలో ఏమి జరిగిందో అని రాయించుకున్నారే తప్ప ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. జరిగిన సంఘటనపై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోల్‌మాన్‌పేట రైతుకు అభ్యుదయ అవార్డు

కోసిగి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన రైతు అరిమిల్లి కృష్ణ దంపతులు ఉత్తమ రైతు అభ్యుదయ అవార్డును అందుకున్నారు. గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం రైతు నేస్తం ఫౌండేషన్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సంక్రాంతి పురస్కారంలో భాగంగా అభ్యుదయ రైతు పురస్కారాన్ని రైతు కృష్ణకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, నరసరావుపేట ఎంపీ లావ కృష్ణదేవరాయలు విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఎండీ లావ రత్తయ్య అందజేశారు.

మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

పెద్దకడుబూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ హనుమంతు రెడ్డి నెల రోజుల క్రితం గుండెపోటుతో మరణించిన విషయం విధితమే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మిగనూరు టీడీపీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సోమవారం పెద్దకడబూరులోని వారి స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుటుంబ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, రాంమోహన్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, రవి చంద్ర రెడ్డి, టీడీపీ నాయకులు హనుమంతు రెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, దశరథ రాముడు, ఏసేపు, విజయ్,బాబు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి

నందవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధికి యాజమాన్య కమిటీ సభ్యులు కృషి చేయాలని కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. సోమవారం ఆమె స్కూల్ యాజయాన్య కమిటి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధికి యాజమాన్య కమిటీ సభ్యులు కీలకమన్నారు. తల్లిదండ్రులు వలస వెళితే విద్యార్థినులను స్కూల్లో వదలి వెళ్లాలన్నారు. యాజమాన్య కమిటీ సభ్యలకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నాగవేణి, చైర్మన్ భీమన్న, వైస్ చైర్మన్ సునీత, సభ్యులు లింగప్ప, నరసమ్మ పాల్గొన్నారు.

మంత్రాలయం చేరుకున్న పాదయాత్ర భక్తులు

మంత్రాలయం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం భక్తులు పాదయాత్రగా సోమవారం రాత్రి మంత్రాలయం చేరుకున్నారు. కర్ణాటకలోని సిరిగుంప నుంచి దాదాపు 800 మంది 29 ఏళ్లుగా మంత్రాలయం వరకు 100 కి.మీల మేర పిల్లలు, పెద్దలు, మహిళలు, వృద్ధులు పాదయాత్ర చేపడుతారు. ఈ నెల 4న పాదయాత్రను ప్రారంభించగా.. 6వ తేదీ రాత్రి మంత్రాలయం చేరుకున్నామని ఆర్యవైశ్య పాదయాత్ర సంఘం అధ్యక్షుడు హనుమంతయ్య, లక్ష్మీనారాయణ, నాగరాజు, విష్ణువర్ధన్ తెలిపారు. అనం తరం రథోత్సవాల ఊరేగింపులో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం శ్రీరాఘవేంద్ర అష్టోత్తర హోమం, డ్రైఫ్రూట్స్‌తో పీఠాధిపతికి తులాభారం చేస్తున్నట్లు హనుమంతయ్య తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, విజయకుమార్, మంజునాథ్, నరసప్ప, కృష్ణమూర్తిలు పాల్గొన్నారు.

అయోధ్యలో రాఘవేంద్ర మఠం నిర్మాణానికి స్థల సేకరణ

బాలరాముడ్ని దర్శించుకున్న మఠం పీఠాధిపతి

మంత్రాలయం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రామజన్మభూమి అయిన అయోధ్యలో రాఘవేంద్రస్వామి మఠం బ్రాంచ్ నిర్మాణానికి స్థల పరిశీలన పూర్తయినట్లు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు తెలిపారు. సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని రామమందిరంలోని బాలరామున్ని దర్శించుకున్న అనంతరం రాఘవేంద్రస్వామి మఠం నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. గతంలో రెండుసార్లు పర్యటించి స్థలాన్ని రెండు, మూడు చోట్ల ఎంపిక చేశారు. అందులో ఒక స్థలాన్ని శ్రీమఠం నిర్మాణానికి అనువైన స్థలం ఉండటంతో ఖరారు చేసినట్లు తెలిపారు. త్వరలో అయోధ్యలో రాఘవేంద్రస్వామి మఠం నిర్మాణ పనులు పూర్తి చేసి బాలరామున్ని దర్శించుకున్న అనంతరం రాఘవేంద్రస్వామిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో నిర్మాణాలు కొనసాగించి త్వరలో భక్తులకు అందుబాటులోకి తెస్తామన్నారు.

● **బాలరాముడ్ని దర్శించుకున్న మఠం పీఠాధిపతి:** అయోధ్యలో వెలసిన బాలరామున్ని మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ట్రస్టు అధికారులు గోపాల్‌జీ మునిరాజ్ ఘనంగా స్వాగతం పలికారు. బాలరామున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. అక్కడ స్వామీజీకి ఫల ప్రసాదాలు సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ బెంగుళూరు పట్టణ అధ్యక్షులు సుబ్బనరసింహ, రాజా ఎస్ అప్రమేయాచార్, ద్వార పాలక అనంత స్వామి, ప్రకాషాచార్‌లు పాల్గొన్నారు.



అయోధ్య రామమందిరం ఆవరణలో పీఠాధిపతి, అధికారులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి

తహసీల్దార్ కుమారస్వామి



గోనెగండ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. మండలంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు. రేషన్ సమస్యలు కూడా ఉంటే ప్రజలు మా దృష్టికి తీసుకు వస్తే వాటిని కూడా వెంటనే పరిష్కరిస్తామన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: రెవెన్యూ సదస్సులలో ఎలాంటి సమస్యలు మీ దృష్టికి వచ్చాయి?

జవాబు: గోనెగండ్ల మండలంలో రెవెన్యూ సదస్సులు ముగిశాయి 331 సమస్యలు రాగా వాటిలో ఇప్పటి వరకు 82 సమస్యలను పరిష్కరించాము. 15 గ్రామాల్లో భూ సర్వేలు చేశారు. ఇంకా మిగిలిన ఐదు గ్రామాల్లో సర్వేలు చేయాల్సి ఉంది. అయితే ఒక కుటుంబంలోని ఇద్దరు అంతకు మించి ఉన్న అన్నదమ్ముల ఆస్తులకు జాయింట్ ఎల్‌పీ ఇవ్వడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. సబ్‌డివిజన్ చేసి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: భూసమస్యలను పరిష్కరించేందుకు ఎన్ని టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు?

జవాబు: మండలంలోని భూసమస్యలను పరిష్కరించేందుకుగాను మూడు టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నాం. వాటికి రోజుకు నిర్ణయించిన ఎకరాలలో సర్వేచేయాలని ఆదేశాలు వస్తాయి. అన్ని ఎకరాలో సర్వేలు చేసి సమస్యలను పరిష్కరిస్తాం.

ప్రశ్న: కొత్త రేషన్ కార్డులు ఎప్పటి నుంచి ఇస్తారు ?

జవాబు: కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుంది. అప్పటి నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: పట్టాదారుపాసు పుస్తకాలు రైతులకు ఎన్నిరోజులలో అందుతుంది?

జవాబు: పట్టాదారు పాసు పుస్తకం సంబంధించి దరఖాస్తు చేసుకున్న వెంటనే విచారణ చేసి ఉన్నతాధికారులు పంపుతాము. అక్కడి నుంచి పాస్‌పుస్తకం ప్రింట్ అయి రావడానికి దాదాపు మూడు మాసాలు పడుతుంది. అదికూడా నెరుగా రైతు ఇంటికే చేరుతుంది.

జిల్లా స్థాయిలో బీవీ క్రికెట్ టోర్నమెంట్



పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండంలోని నదీకైరవాడిలో దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి స్మారక జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఐ- టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కురవ వీరేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈ నెల 19వరకు క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంట్రీ ఫీజు రూ 800 చెల్లించాలన్నారు. విన్నర్‌కు కురవ వీరేష్ రూ15116, రన్నరప్‌కు రూ 10,116ల బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీలర్ బజారి, మాజీ సర్పంచ్ వీరారెడ్డి, లక్ష్మికాంత్, వీరాంజినేయులు, తాయన్న, నరసన్న, శివకుమార్ పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి

గోనెగండ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా ఉల్లి, మిరప పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎమ్మిగనూరు ఉద్యాన వనశాఖ అధికారి శ్రీవాణి అన్నారు. సోమవారం గోనెగండ్లలో ఉల్లి, మిరప పంటలను సాగు చేసిన రైతులకు ఒక్క రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ ఉల్లి, మిరప పంటలు అధిక పెట్టుబడులతో కూడిన పంటలన్నారు. రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మిరప, ఉల్లి, పంటలలో వచ్చు తెగుళ్లు, పురుగులు, మరియూ తెల్లదోమ, పచ్చ దోమ, మొదలైన వాటి నివారణ గురించి రైతులకు సమగ్రంగా వివరించారు. సలహాలు, సూచనలు అవసరమైన రైతులు స్థానిక వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించాలి

కోసిగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సజ్జలగుడ్డం, జంపాపురం, దేవరబెట్ట, ఐరంగల్ గ్రామాల ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ నిత్యానంద రాజుకు, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు దివాకర్, కార్తీక్, హుశేనీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి

గోనెగండ్ల, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కురుమ, కురుబ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా చదువుకున్న యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర డైరెక్టర్ కురమ రామకృష్ణ అన్నారు. సోమవారం విజయవాడలోని బీసీ భవన్ ఆవరణంలో కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వార కురుబ కులస్థుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రాజకీయ నాయకులు, కురువ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను ముంచిన ప్రభుత్వాలు

కోసిగి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రంలోని నిరుద్యోగులను నట్టేట ముంచాయని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి జీవన్ అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల నాయకులు ప్రకాష్, రాము, నవీన్, బాబు, చిన్న, వీరేష్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నందవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబాని వైసీపీ మండల అధ్యక్షుడు శివారెడ్డిగౌడు సోమవారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన నాగరాజు కుమారుడు శవాల సురేష్ గతనెల ట్రాక్టర్ ఢీ కొని కాళ్ల చేతులు విరిగాయి. సోమవారం ఆస్పత్రి నుంచి ఇంటికి రావడంతో శివారెడ్డిగౌడు ఆయనను పరామర్శించారు. ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఆయనతో పాటు వార్డు సభ్యులు దేవళ్ల నాగన్న, గుడిసె ముని పాల్గొన్నారు.